మహబూబ్‌నగర్



వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల్ / నారాయణపేట

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్రబోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్1,ప్రభాతవార్త :** వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వి.సి.కాన్ఫరెన్స్ హాల్ లో రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ తో కలిసి పౌర సరఫరాల శాఖ,మార్కెటింగ్, ఐ.కే.పి.,సహకార శాఖ,మిల్లర్ లతో సమావేశం నిర్వహించి ధాన్యం కొనుగోళ్ల పై సమీక్షించారు. ధాన్యం కొనుగోలు కేంద్రం కు వచ్చిన వెంటనే నాణ్యతా ప్రమాణాలు,తేమ శాతం ఉన్న ధాన్యం కాంటా వేయాలని అన్నారు. తుఫాన్ ప్రభావం దృష్ట్యా వర్షం పడితే ధాన్యం తడవకుండా టార్పాలిన్ లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు లో రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తగు చర్యలు తీసుకోవాలని,కొనుగోళ్లలో ఎటువంటి నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని ఆమె హెచ్చ రించారు .పత్తి కొనుగోళ్లపై సమీక్షించారు.పత్తి 7 క్వింటాళ్ల పై దిగుబడి ఉంటే రైతు వ్యవసాయ విస్తరణ అధికారి ధృవీకరించిన సర్టిఫికెట్ తో కొనుగోలు కు తీసుకురావాలని తెలిపారు .మొక్క జొన్న కొనుగోళ్ల పై సమీక్షించి వేగంగా కొనుగోళ్ళు చేయాలని అన్నారుసంబంధిత అధికారులు కొనుగోలు కేంద్రాలు సందర్శించి సమస్యలు ఉంటే పరిష్కరించాలని ఆదేశించారు.సమావేశం లో రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్,జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్, పౌరసరఫరాల సంస్థ డి.ఎం.రవి నాయక్,జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేష్,జిల్లా సహకార అధికారి కృష్ణ, డి.ఆర్.డి. ఓ నర్సింహులు,మార్కెటింగ్ అధికారిని బాలమణి,జిల్లా సహకార ఆడిట్ అధికారి టైటస్ పాల్ తదితరులు పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

## ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

- రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్
- పాల్గొన్న కలెక్టర్ విజయేంద్ర బోయి, ఎస్పీ జానకీ

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్1,ప్రభాతవార్త :** 2వ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని అన్నారు. సోమవారం హైదరాబాదు నుండి ఉమ్మడి మహబూబ్ నగర్, రంగారెడ్డి జిల్లాల జిల్లా కలెక్టర్లు, ఎన్నికల పరిశీలకులు, పోలీస్ అధికారులతో ఎన్నికల నిర్వహణపై వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండవ విడత నామినేషన్ల స్వీకరణ, వచ్చిన నామినేషన్ల పరిశీలన ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని, తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఎన్నికల సిబ్బంది కేటాయింపు, పోస్టల్ బ్యాలెట్ బ్యాలెట్ బాక్సులు, శాంతిభద్రతలు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ, జిల్లాలో మొదటి విడత నామినేషన్ల ప్రక్రియ విజయవంతంగా నిర్వహించడం జరిగిందని, నామినేషన్ల పరిశీలన కూడా నిర్వహించడం జరిగిందన్నారు. ఎన్నికల నిర్వహణకు రాండమైజేషన్ ద్వారా ఎన్నికల సిబ్బందిని, అవసరమైన బ్యాలెట్ బాక్సులను కేటాయించడం జరిగిందని అదేవిధంగా ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కూడా సమకూరుస్తున్నట్లు తెలియజేశారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్ కాస్టింగ్ నిర్వహించనున్నట్లు,మైక్రో ఆబ్జర్వర్ లను నియమించనున్నట్లు తెలిపారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలియజేశారు. ఎస్.పి.డి జానకి మాట్లాడుతూ ఎఫ్.ఎస్.టి.,ఎస్.ఎస్.టీ బృందాలు పర్యవేక్షణ చేస్తున్నట్లు,బైండోవర్ కేసులు 61 శాతం పూర్తి చేసినట్లు తెలిపారు.

### కొడంగల్-నారాయణపేట-మక్తల్ ఎత్తిపోతల

## రెండేండ్లలో పూర్తి చేస్తాం

- కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రానికి శ్రీరామరక్ష
- రూ.1000 కోట్ల నిధులతో మక్తల్ అభివృద్ధి
- రూ. 800 కోట్లతో శ్రీశైలం ఎలివేటర్‌కు శ్రీకారం
- రూ.210 కోట్లతో మక్తల్-నారాయణ పేట రోడ్ నిర్మాణానికి కృషి
- సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి
- మక్తల్‌లో ప్రజాపాలన వారోత్సవాలు
- పాల్గొన్న మంత్రులు దామోదర, కోమటిరెడ్డి,జూపల్లి, శ్రీహరి



ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**మక్తల్ టౌన్, డిసెంబరు 1 ప్రభాతవార్త :** రానున్న రెండేండ్లలో కొడంగల్-నారాయణపేట-మక్తల్ ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి ఈ ప్రాంతానికి నీళ్లిస్తామని ఆ దిశగా యువత అధికారులు, నాయకులు వెంట పడి పూర్తి చేసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా మక్తల్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు పలు అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు.అనంతరం ఏర్పాటుచేసిన సభలో పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు ఏళ్లు పూర్తి పూర్తవుతున్న సందర్భంలో విజయోత్సవ సభను మొదట మక్తల్‌లోనే నిర్వహించుకోవడం చాలా సంతోషంగా ఉందని కొనియాడారు. ఉమ్మడి రాష్ట్రంతో పాటు పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో పాలమూరు జిల్లా నిర్లక్ష్యానికి గురైందని పాలమూరు పాలమూరు ప్రజలు అభివృద్ధిలో అట్టడుగున పడిపోయారని గుర్తు చేశారు. ఇప్పటివరకు పాలమూరు జిల్లాను ఏ నాయకుడు కూడా పట్టించుకోకుండా పది సంవత్సరాలలో ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు. దానికి ప్రతిఫలంగా పాలమూరు జిల్లా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో భాగంగా 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గెలిపించి ఈ రోజు నాకు తెలంగాణ రాష్ట్రానికి రెండో ముఖ్యమంత్రిగా పట్టం కట్టిన సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు. స్వాతంత్రం వచ్చిన తొలి రోజుల్లో మనపాలమూరుజిల్లా నుంచి ముఖ్యమంత్రి అయిన బూర్గుల రామకృష్ణారావు అయినతర్వాత 75 ఏళ్ల కాలంలో పాలమూరు జిల్లా నుండి ముఖ్యమంత్రి ఎవరు కాలేదని గుర్తు చేశారు. ఈ రోజు మళ్లీ తెలంగాణ రాష్ట్ర మీ పాలమూరు బిడ్డకు అవకాశం కల్పించినందుకు జిల్లాలోని ప్రాజెక్టులు విద్యావ్యవస్థలు రోడ్లు బాగుచేసే బాధ్యత నేను తీసుకుంటానని తెలియజేశారు. ఇప్పటికే నారాయణపేట కొడంగల్ ప్రాజెక్టు పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుల పనులు శరవేగంగా జరుగుతున్నాయని రాబోయే రెండు సంవత్సరాలలో పాలమూరు జిల్లా పెండింగ్ పనులన్నీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కొందరు కుట్రపూరితంగా మక్తల్, నారాయణపేట, కొడంగల్ ప్రాజెక్టుపై కేసులు వేసి అడ్డుకునే ప్రయత్నం చేసి చేస్తున్న వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరు ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసిన ఏ పని ఆగదని రాబోయే రోజుల్లో పనులన్నీ పూర్తిచేసే బాధ్యత నాదని హామీ ఇచ్చారు. కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టు భూ నిర్వాసితులకు ఎకరాకు 20 లక్షల రూపాయలను పరిహారం ఇస్తున్నామని రైతులకు భరోసా ఇచ్చారు. కొందరు వ్యక్తుల మాయ మాటలు విని ప్రాజెక్టుల అభివృద్ధిని అడ్డుకోవద్దని రైతులను కోరారు ఎంత ఖర్చైనా సరే ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టులన్ని పూర్తిచేసే బాధ్యత తనదే అని భరోసా ఇచ్చారు నిధులు ఎన్ని కావాలన్నా ఇచ్చేందుకు నేను సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు ఇరిగేషన్ ఎడ్యుకేషన్ ప్రధాన అంశాలుగా తీసుకుంటున్నట్లు కేవలం వలసలే పాలమూరు బిడ్డకు విద్యను దూరం చేశాయని ఈరోజు ఆ పాలమూరు బిడ్డ ముఖ్యమంత్రికావడం గర్వకారణమన్నారు. జిల్లాలో ప్రతి నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేసామని ఒక్కరుకూడా ఆర్థికసమస్యతో చదువుకు దూరం కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి తెలియజేశారు.రాజకీయాలకతీతంగా అన్ని నియోజకవర్గాలలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలలో నిర్మిస్తున్నామని తెలియజేశారు.

ఉమ్మడి రాష్ట్రంలో చిట్టెనర్సి రెడ్డి ప్రారంభించిన మక్తల్,నారాయణపేట,కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టును తాను మంజూరు చేయిస్తే ఆ జీవోలను తొక్కిపెట్టి ప్రాజెక్టులో మట్టికొట్టారని చెప్పారు. 69జీవో సాధనసమితిని పట్టించుకోలేదన్నారు. ప్రజా ప్రభుత్వంలో మక్తల్, నారాయణపేట, కొడంగల్ఎత్తిపోతల ప్రాజెక్టను ప్రారంభించాలని టెండర్లు పిలిస్తే కేసులు వేసి అడ్డుకున్నారని, ఏడాదిన్నర కాలం ప్రాజెక్టును ఆపారని పేర్కొన్నారు. ఇక్కడి రైతుల కోరిక మేరకు, మంత్రి శ్రీహరి సూచన మేరకు పరిహారం కింద ఎకరాలకు రూ.20లక్షలు ఇస్తామని చెప్పారు. ఏ రైతుకు కూడా నష్టం జరగొద్దని ఇవ్వొద్దన్నారు. 96శాతం భూమి ఇస్తున్నామని రైతులు ఒప్పుకున్నారని దేశ చరిత్రలోనే ఎక్కడా ఇలా జరగలేదన్నారు.సుమారు 5వేలకోట్లతో,లక్షా 10వేల ఎకరాలకు నీళ్లివ్వడానికి ప్రాజెక్టు రూపకల్పన జరుగుతుందన్నారు. 75ఏండ్లలో ఈ ప్రాంతానికి నీళ్లివ్వలేదని నాజీవితంలో ఇంతకంటే గొప్ప సంతోషం కలగలేదన్నారు. ఒక మీదట పనులు ప్రారంభమవుతాయన్నారు.కాళ్లల్లో కట్టెలు పెట్టే వారు ఉంటారని రైతులు జాగ్రత్తగా ఉండాలని, ఇప్పుడు ఇంకెప్పుడు పనులు చేసుకోలేమన్నారు. జీవో 69 పదేండ్లలో పాతాళానికి తొక్కివేయబడిందని, మళ్లీ ఈ ప్రాంత బిడ్డకు అవకాశం వచ్చిందని రెండేండ్లలో -మిగతా4లో..



సీఎం రేవంత్‌రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం



శ్రీ శ్రీ పడమటి ఆంజనేయ స్వామి దేవాలయంలో..



వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రుల బృందం

## తెలంగాణ దేశానికే తలమానికం

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- ఆత్మకూరులో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**ఆత్మకూర్ డిసెంబర్ 1, ప్రభాతవార్త:** భారతదేశంలోనే అభివృద్ధికి తలమానికంగా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం రోజు మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణ శివారులో రూ.177 కోట్ల నిధులతో చేపట్టే వివిధ రకాల అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపనలు చేశారు. ప్రధానంగా ఆత్మకూర్ మండలంలోని జూరాల గద్వాల్ ప్రాంతాలను కలుపుతూ కృష్ణా నదిపై నిర్మించే 121 కోట్ల నిధులతో చేపట్టనున్న బ్రిటీ నిర్మాణానికి శంకుస్థాపన గావించారు. అంతే కాకుండా ఆత్మకూర్ అమర్ చింత మున్సిపల్ పట్టణాలలో వివిధ అభివృద్ధి పనులకు గాను 30 కోట్ల నిధులతో చేపట్టే అభివృద్ధి పనికి పట్టణంలోని ఇండోర్ స్టేడియానికి నాలుగు కోట్ల నిధులు మార్కెట్ కార్యాలయ ఆవరణలో మార్కెట్ వాణిజ్య సముదాయానికి, పట్టణ శివారులో 22 కోట్ల నీళ్లతో చేపట్టే 50 పథకాల ఆస్పత్రి భవనానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర మంత్రులతో కలిసి శంకుస్థాపనలు గావించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ గడచిన పదేళ్ల కాలంలో తెలంగాణ అభివృద్ధికి నోచుకోకుండా పోయిందని సోనియాగాంధీ దయాదాక్షిణ్యాలతో వచ్చిన తెలంగాణను అభివృద్ధి చేయాల్సింది పోయి పాలకులు తిరోగమన వైపు నడిపించారని తెలంగాణ రాష్ట్రాన్ని కాపాడమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని ఆయన అన్నారు అంతకుముందుగా పట్టణ సమీపంలోని జాతర మైదానంలో ఎలిపాడు నుండి దిగిన ముఖ్యమంత్రికి రాష్ట్ర మంత్రి వాకిడి శ్రీహరి సాదర స్వాగతం పలుకగా పట్టణంలోని ప్రధాన రహదారి నుండి ప్రదర్శి జూరాల ప్రాజెక్టు క్వార్టర్స్ వరకు ముఖ్యమంత్రి కాన్వాయ్ ద్వారా ప్రయాణించి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు గావించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రణాళికా సంఘం అధ్యక్షులు జిల్లెల్ల చిన్నారెడ్డి వనపర్తి మరియు గద్వాల దేవరకద్ర శాసనసభ్యులు మధుసూదన్ రెడ్డి బండ్ల కృష్ణమోహన్ రెడ్డి తోడి మేఘారెడ్డి తదితరులు పాల్గొనగా శంకుస్థాపన కార్యక్రమం ఆవరణలో జిల్లా అటవీ శాఖ అధికారి రవీందర్ ప్రసాద్ ముఖ్యమంత్రి కి పూల బొకే ఇచ్చి సాదరంగా ఆహ్వానించారు. వేదమంత్ర చరణాల మధ్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు గావించిన అనంతరం మక్తల్ నియోజకవర్గం కేంద్రానికి తరలి వెళ్లారు. ముఖ్యమంత్రి రాకను పురస్కరించుకొని వనపర్తి ఎస్పీ సునీత రెడ్డి ఆధ్వర్యంలో డిఎస్పీ వెంకటేశ్వరరావు తదితరులతో కూడిన భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## మహిళల భద్రత మా బాధ్యత..

- 38 విద్యాలయాల్లో అవగాహన
- 95 హాట్‌స్పాట్ విజిట్,23కౌన్సిలింగ్‌లు..
- మహబూబ్‌నగర్ ఎస్పీ జానకీ వెల్లడి



ఎస్పీ జానకీ

**మహబూబ్‌గర్ బ్యూరో, డిసెంబర్ 1, ప్రభాత వార్త:** నవంబర్ 1 నుంచి నవంబర్ 30 వరకు మహబూబ్‌నగర్ జిల్లాలో షీ టీమ్స్ సిబ్బంది మహిళలు, బాలికలు, విద్యార్థినుల రక్షణ కోసం నిరంతరం పర్యవేక్షణ చేపట్టినట్లు మహబూబ్‌నగర్ ఎస్పీ జానకీ తెలిపారు. మహిళలు, ఆడబిపిల్లలకు షీ టీం మేమున్నామంటూ భరోసినిస్తున్నది. మహిళలు, బాలికల భద్రత తెలంగాణ పోలీసుల ప్రధాన బాధ్యత అంటూ ముందుకు సాగుతున్నారు. అక్టోబర్ నెలలో ఏఐటీయూ, షీ టీమ్స్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిఘా చర్యలు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. స్కూళ్లు, కళాశాలలు, గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఒక్క నవంబర్‌నెలలోనే మొత్తం 22 అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. 30హాట్‌స్పాట్ ప్రాంతాలు సందర్శించారు. సమాచారం సేకరణ కురుమూర్తి జాతరలో తప్పిపోయిన పిల్లలు,వృద్ధులను గుర్తించి కుటుంబాలకు అప్పగింపు మానవ అక్రమ రవాణా, బాల్యవివాహాలు, బాల కార్మికత్వం, అవయవ విక్రయం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తూ వచ్చారు. ఎవరైన ఆకతాయిలు ఎక్కడైనా బస్టాప్, ఇండ్ల వద్ద, దుకాణాల వద్ద, షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ఇబ్బందులకు గురి చేసినా అసహ్యంగా ప్రవర్తించినా, 8712680066/100 షీ టీమ్స్ విభాగానికి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఇప్పటికే అందిన వాటిలో 28 ఫిర్యాదులు, 23కౌన్సిలింగ్, 17రెడ్ హ్యాండెడ్ కేసులు, ఎఫ్ఐఆర్ 2, ఈ పెట్టీ కేసులు 4అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. 95హాట్‌స్పాట్ విజిట్, 38 విద్యాసంస్థల్లో ర్యాగింగ్, ఇవిటీజింగ్, పాక్సో, సోషల్ మీడియా, సెల్ఫ్ డిఫెన్స్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఫిర్యాదుల కోసం షీ టీమ్ నంబర్: 8712659365 / డయల్ 100 ఎలాంటి వేధింపులకైనా గురైతే వెంటనే డయల్ 100 లేదా షీ టీమ్ నంబర్‌కి సమాచారమివ్వాలని, ఫిర్యాదు దారుల వివరాలు గోప్యంగా ఉంచబడతాయని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో మహిళలు, విద్యార్థినులు వెంటనే షీ టీమ్స్‌ను సంప్రదించవచ్చని, సివిల్ డ్రస్‌లో షీ టీమ్స్ సిబ్బంది ప్రతి రోజూ విద్యాసంస్థలు, ప్రజా ప్రదేశాలలో కాపలా కాస్తూ నిఘా ఉంచుతున్నారని తెలిపారు. మీ భవిష్యత్తును ఎవరి వేధింపుల వలన నాశనం చేసుకోకుండా ధైర్యంగా చదువుకోవాలి. షీ టీమ్స్ ఎల్లప్పుడూ మీ రక్షణ కోసం సిద్ధంగా ఉంటాయి" అని జిల్లా ఎస్పీ డి.జానకి అన్నారు.

**వివరాలు గోప్యంగా ఉంచుతాం..**

వేధిస్తే డయల్ 100కు ఫిర్యాదు చేయండి. ఎవరైనా వేధిస్తే డయల్ 100కు ఫిర్యాదు చేయండి. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతాం. ఆకతాయిల ఆటకట్టించేందుకు పోలీస్ యంత్రాంగం అంతామీకు అండగా ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా పోలీసులు, షీ టీం బృందాలు మఫ్టీలో ఉన్నారు. సీసీ కెమెరాల ద్వారా కూడా నిఘా ఉంచాం. అమ్మాయిలను వేధిస్తే జైలుకు పంపుతాం. కఠిన చర్యలు ఉంటాయి. షీ టీం మీకు ఎల్లప్పుడూ రక్షణగా ఉంటుంది.

- మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకీ

### ప్రతి అభ్యర్థికి ఎన్నికల వ్యయముల ఖాతా

## పత్రాలను విధిగా అందజేయాలి

**గద్వాల టౌన్ డిసెంబర్ 01, ప్రభాతవార్త:** గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు నామినేషన్ వేసిన ప్రతి అభ్యర్థికి ఎన్నికల వ్యయముల ఖాతా నిర్వహణ పత్రాలను విధిగా అందజేయాలని జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ అన్నారు. సోమవారం మల్దకల్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ భవనంలో ఏర్పాటు చేసిన మల్దకల్ 1, ఎంఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మల్దకల్ 2, తాటికుంట గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. ఆయా గ్రామ పంచాయతీలలో సర్పంచ్, వార్డు స్థానాలకు కేటాయించిన రిజర్వేషన్స్ ప్రకారం సంబంధిత అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించాలనీ రిటర్నింగ్ అధికారులకు సూచించారు.. పోటీ చేయు అభ్యర్థుల నుంచి అవసరమైన ధృవపత్రాలను తీసుకొని విధిగా దరఖాస్తుకు జత పరచాలని, డిక్లరేషన్ తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. నామినేషన్ వేసిన అభ్యర్థులతో నిర్దేశిత డిపాజిట్ తీసుకొని తగిన రసీదును ఇవ్వాలని పేర్కొన్నారు. నామినేషన్ కేంద్రంలోకి అభ్యర్థితో పాటు మరో ఇద్దరిని మాత్రమే అనుమతించాలని సూచించారు. నామినేషన్ వేసే - మిగతా4లో..



నామినేషన్ కేంద్రంలో అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న కలెక్టర్ సంతోష్



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

### ప్రిసైడింగ్ అధికారుల

## పాత్ర కీలకం

పిఓ, ఏపీవోలు పోలింగ్ రోజు చేపట్టాల్సిన విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి: కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి, డిసెంబరు 1 ప్రభాతవార్త:** ఎన్నికల్లో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకమని, తమ విధులు, బాధ్యతలపై పూర్తి అవగాహన పెంచుకుని పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. సోమవారం మదనాపురం - మిగతా4లో..




మీడియా సెంటర్‌ను సందర్శిస్తున్న కాత్యాయినీ దేవి

### ఎప్పటికప్పుడు

## సమాచారం సేకరించాలి

- సాధారణ పరిశీలకురాలు కాత్యాయనీ దేవి

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్1,ప్రభాతవార్త :** గ్రామ పంచాయతీ ఎన్నికసాధారణ పరిశీలకురాలు కాత్యాయనీ దేవి కలెక్టరేట్ కార్యాలయం లో ఏర్పాటు చేసిన మీడియా - మిగతా4లో..



అధికారులకు పలు సూచనలు చేస్తున్న కలెక్టర్

## రైతులను అప్రమత్తత చేయండి...

- ధాన్యం తడవకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలి...
- వర్షాల నేపథ్యంలో అధికారులకు సూచనలు చేసిన నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్ 01 ప్రభాతవార్త:** వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఈ నెల 2వ, 3వ తేదీలలో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని, జిల్లాలో వరి ధాన్యం, పత్తి, తడవకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించి ముందస్తు ఏర్పాట్లు చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం జిల్లాలో పంట సాగు చేసిన వరి కోతలు కోసిన పంటలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, ధాన్యం వర్షానికి తడవకుండా చూడాలని వ్యవసాయ, మార్కెటింగ్ డిఆర్డిఏ పౌరసరఫరాల శాఖల అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. సోమవారం సాయంత్రం కలెక్టర్ తన ఛాంబర్‌లో రెండు రోజుల పాటు జిల్లాలో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో కలెక్టర్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ రైతులకు అన్ని విధాలా సహకరించాలని కోరారు. ముఖ్యంగా కొనుగోలు - మిగతా4లో..

## బిజ్వారం సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన వై.శ్రీనివాస్ రెడ్డి సతీమణి

**మల్దకల్ డిసెంబర్ 1,ప్రభాతవార్త:** సోమవారం మల్దకల్ మండలం బిజ్వారం గ్రామంలో గ్రామ ప్రజల ఐకమత్య మద్దతుతో సీనియర్ నాయకులు వై.శ్రీనివాస్ రెడ్డి సతీమణి వై.శైలజమ్మ బిజ్వారం గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేశారు.అనంతరం సర్పంచ్ అభ్యర్థి వై.శైలజమ్మ గ్రామ ప్రజలతో కలిసి మాట్లాడుతూ...బిజ్వారం గ్రామాభివృద్ధికై అనునిత్యం గ్రామ ప్రజలకు అందుబాటులో వుంటూ గ్రామాన్ని అభివృద్ధిపథంలో నడిపించేందుకు ఎల్లకాలం కృషి చేస్తానన్నారు.ఈసందర్భంలో మాజీ ఎంపీపీలు వై.సత్యా రెడ్డి,వై.రాజారెడ్డి,రెడ్డి,ఎల్ఐసి శ్రీనివాస్ రెడ్డి,తిమ్మారెడ్డి,ఎన్.రామనాథ్ రెడ్డి,ఆర్.మీసాల రాజారెడ్డి,సోమేశ్వర్ రెడ్డి,మేకల సోంపల్లి అహ్మద్,జూలకల్ కృష్ణ,సుద్ద వెంకటేశ్వర్ రెడ్డి, ఎండి.మాషుమ్, కొంకల గోకారన్న, బి.నారాయణ నాయుడు, తెలుగు కృష్ణ మూర్తి, శ్రీను గౌడ్, శంకర్ గౌడ్, గుడికాటి ఆశన్న, మెకానిక్ గోవింద్, ఎండి సుభాన్, బీసన్న నాయుడు, చాపకండ్ల ఆశన్న, ఎండి.జహీర్, కమ్మరి బ్రహ్మయ్య, ఎస్. రాజానందం, గోపాల కృష్ణ చారి, వడ్డే గోపాల్, పి.దాస్, కృపానందం, కులమతాలకతీతంగా బిజ్వారం గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న వై.శైలజ

## ఎన్నికల నేపథ్యంలో వాహనాల తనిఖీ

**నవాబ్‌పేట, డిసెంబరు 1 ప్రభాతవార్త :** ఎన్నికల కోడ్ నేపథ్యంలో నవాబుపేట స్థానిక ఎస్సై మండల కేంద్రం లో సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై విక్రమ్ మాట్లాడుతూ ఎలాంటి సరైన ఆధారాలు లేకుండా అధిక మొత్తంలో నగదు, లేదా మద్యం రవాణా చేస్తూ దొరికితే, డబ్బులు లేదా మద్యం తక్షణమే సీజ్ చేయబడుతాయని తెలిపారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే పోలీస్ శాఖ కఠినంగా వ్యవహరిస్తుందని ఆయన స్పష్టం చేశారు. సరైన పత్రాలు లేని వాహనాలు, డబుల్ నెంబర్ ప్లేట్ ఉన్న వాహనాలను సీజ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. వాహనాలపై పెండింగ్ ఉన్న ఛలానాలు వసూలు చేస్తున్నట్లు ఆయన అన్నారు. టూవీలర్ నడిపే వాహనాదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనం నడపరాదని ఎస్సై విక్రమ్ సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది శ్రీనివాస్ గౌడ్, మధు, సీనయ్య, కృష్ణ పాల్గొన్నారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

## అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేసి చూపిస్తా

### చౌదూర్ సర్పంచ్ అభ్యర్థి లక్ష్మీ వేణుగోపాల్

**నవాబుపేట, డిసెంబరు 1 ప్రభాతవార్త :** నవాబుపేట మండలం చౌదూరు గ్రామపంచాయతీ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు లక్ష్మి వేణుగోపాల్ యాదవ్ చౌదూరు గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలి అని గ్రామాన్ని అభివృద్ధి పథంలో చేసి చూపిస్తానని గ్రామస్తులు బలపరచాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందిస్తూ చౌదూరు కాంగ్రెస్ పార్టీ నాయకుల, కార్యకర్తల ఆధ్వర్యంలో కండువా వేసి మద్దతు తెలిపారు. హైదరాబాదులో ఎమ్మెల్యే సర్పంచ్ అభ్యర్థికి మద్దతు పలికి,సర్పంచ్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ కోసం కొన్ని సంవత్సరాలుగా జండా మోస్తున్న కార్యకర్తలకు మా మద్దతు తప్పకుండా ఉంటుందని తెలియజేశారు. ఎమ్మెల్యే స్పందనకు గ్రామ ప్రజలు నాయకులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శబీర్, జహంగీర్, సత్యం, సీను, నరేందర్ యాదవ్, బంక లక్ష్మయ్య, భీమయ్య, గ్రామ నాయకులు, కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు.

## రిజర్వేషన్లు అమలైన గ్రామాలలో కొనసాగుతున్న రాచరిక పాలన

**ఉప్పునుంతల, డిసెంబరు 1 ప్రభాతవార్త :** స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ ,బీసీ రిజర్వేషన్లు ప్రకటించిన గ్రామాలలో కొనసాగుతున్న రాచరిక పాలన కొనసాగుతూనే ఉంది. మండలంలోని ఓ గ్రామంలో బిసి మహిళా రిజర్వు కావడంతో ఆ గ్రామంలో ఏకతాటిపైకి తీసుకురావడానికి ఓ సామాజిక వర్గం బీసీ వర్గంపై ఉగ్రరూపం దాల్చారు. చట్టాలు మారుతున్న గ్రామాలలో మాత్రం ఆ వర్గందే పై చేయిగా కొనసాగుతుంది. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ గ్రామాలలో సర్పంచు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులపై ఒత్తిడి తీసుకురావద్దని ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ స్థానిక నాయకుల పెత్తందారు చలామని కొనసాగుతుంది. రిజర్వేషన్లు కల్పించడం ఎందుకని, తమకు ఇంకా స్వాతంత్రం లేకపోవడం ఎంత విడ్డూరంగా ఉందని బిసి వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. గ్రామంలో రిజర్వేషన్ ప్రకారంగా ఎన్నిక జరపకుండా ఒకరికి మద్దతు పలకాలంటూ మిగిలిన వారిపై ఒత్తిడి తీసుకురావడం, వారి పట్ల అసహనం వ్యక్తం చేయడం ఎంతవరకు సమంజసం అని ఆ గ్రామానికి చెందిన పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ఎన్నికల కమిషన్, జిల్లా ఎన్నికల అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని గ్రామాలలో కొనసాగుతున్న రాచరిక పాలనకు చరమగీతం పాడుతూ ప్రజాస్వామ్య పాలనలో గ్రామాలలోపోటీ చేసే అభ్యర్థుల పట్ల ఒత్తిడి తీసుకురాకుండా శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## గీత జయంతిని ప్రభుత్వ స్థాయిలో నిర్వహించాలి

**నారాయణ పేట, డిసెంబరు 1 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా కేంద్రంలోని సద్గురు అవధూత నరసింహ స్వామి మఠంలో సోమవారం గాన గంధర్వులు ఎస్పీ బాలు అభిమాన సంఘం రాష్ట్ర అధ్యక్షులు మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో గీత జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యోగి అచ్యుత ఆశ్రమ సాధకులు విద్యశ్రీ గోవర్ధన్ శారి మాట్లాడుతూ గీత జయంతిని ప్రభుత్వ పరంగా నిర్వహించాలని కోరారు. భగవద్గీతను ప్రతి పాఠశాలలో విద్యార్థులకు బోధించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరుతూ,భగవద్గీత పఠనం వలన ఆత్మ జ్ఞానం పెంపొందడంతో పాటు వ్యక్తి జీవన శైలి మార్పుకు దోహదపడుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోజువారీగా భగవద్గీత పఠనం అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమానికి ముందు శ్రీ కృష్ణ పరమాత్ముని చిత్రపటానికి, భగవద్గీత గ్రంథాలకు పూజలు నిర్వహించి, భక్తులకు భగవద్గీత పుస్తకాలు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మఠం కమిటీ ఉపాధ్యక్షులు రామకృష్ణ, కళ్యాణి, దేవదత్త, సంగ నర్సింహులు, కిరణ్ డగే, అంబ్రెష్ డగే, అర్చకులు రామకృష్ణ, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



భగవద్గీత పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

## స్థానిక ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

### జిల్లా ఎన్నికల సహాయ అధికారి వరుణ్ తేజ

**ఉప్పునుంతల, డిసెంబరు 1 ప్రభాతవార్త :** గ్రామాలలో ఈనెల 17న జరుగు స్థానిక ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా సహాయ ఎన్నికల అధికారి, ఎంపిడిఓ వరుణ్ తేజ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సోమవారం సాయంత్రం మూడో విడత ఎన్నికలు మండలంలో జరగనున్నాయని గ్రామ పంచాయతీ ఎన్నికల విధులు నిర్వహించే రిటర్నింగ్ అధికారులు,అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు జోనల్ అధికారులు గ్రామాలలో పర్యటిస్తున్నప్పుడు పంచాయతీ కార్యదర్శులు వారికి సహకారం అందించాలని సూచించారు. ఏమాత్రం తప్పిదాలు లేకుండా అందరి సమిష్టి కృషితో స్థానిక ఎన్నికలు విజయవంతంగా సాగేందుకు పంచాయతీ కార్యదర్శులు కృషిచేయాలని సూచించారు. ఎన్నికలు పూర్తి అయ్యేంతవరకు పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండాలని, ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు.ఈకార్యక్రమంలో జిల్లా సహాయ ఎన్నికల అధికారి, ఎంపిడిఓ వరుణ్ తేజ, మాస్టర్ ట్రైనర్ అజ్మతుల్లా, మండల పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, కార్యాలయం సూపరింటెండెంట్ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



కార్యదర్శులకు అవగాహన కల్పిస్తున్న మాస్టర్ ట్రైనర్ అజ్మతుల్లా

## రెవిన్యూ డివిజన్ ఏర్పాటుపై స్పష్టమైన ప్రకటన చేయాలి : బిజెపి నిరసన

**ఆత్మకూర్ డిసెంబర్ 1, ప్రభాతవార్త :** నియోజకవర్గం లో భాగంగా ఆత్మకూరు మండలం మూడుముక్కలుగా ఏర్పాటు కావడ కాకుండా తీవ్రంగా నష్టపోయిన మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూర్ పట్టణాన్ని రెవెన్యూ డివిజన్ గా ఏర్పాటు చేస్తామంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన ప్రకటన చేయాలని ఆత్మకూరు నగర బిజెపి శాఖ ఆధ్వర్యంలో సోమవారం రోజు నిరసన తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆత్మకూరు పట్టణంలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు జాతర మైదాన ప్రాంగణంలో హెలికాప్టర్ నుండి సభా ప్రాంగణాన్ని వద్దకు వెళుతుండగా బిజెపి నాయకులు అశ్విని కుమార్ మండల సూరి సంబాద్ తదితరులు రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై స్పష్టమైన ప్రకటన చేయాలంటూ లేక పరీక్షి స్తూ ముఖ్యమంత్రిని కలిసి ఎందుకు ప్రయత్నించగా ఆత్మకూరు సిఐ శివకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బిజెపి నాయకులను నిలవరించారు. ఈ సందర్భంగా అశ్విని కుమార్,బిజెపి పట్టణ అధ్యక్షులు మండల సురేష్ తదితరులు మాట్లాడుతూ గత శాసనసభ ఎన్నికల సమయంలో ఆత్మకూర్ పట్టణాన్ని రెవెన్యూ డివిజన్ గా ఏర్పాటు చేస్తామంటూ హామీ ఇచ్చి రెండు సంవత్సరాలు పూర్తిక వస్తున్నప్పటికీ ఇప్పటివరకు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనుచందంగా ఉందని ఇప్పటికైనా ముఖ్యమంత్రి చేత స్పష్టమైన ప్రకటన చేయించేందుకు రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి చొరవ చూపాలని వారు విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా పట్టణంలోని 30 పడకల ఆసుపత్రి స్థాయిని 23 పడకల ఆసుపత్రి స్థాయికి తగ్గించారని ఈ విషయం ముఖ్యమంత్రితో చర్చించి పట్టణంలోని ఆసుపత్రిని యధావిధిగా ముప్పై పడగలాస్పత్రిగా అప్గ్రేట్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి పర్యటనను పురస్కరించుకుని వనపర్తి ఎస్పీ సునీత రెడ్డి ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినప్పటికీ ముఖ్యమంత్రి హెలికాప్టర్ దిగగానే ఒక్కసారిగా చెన్నకేశవ స్వామి ఆలయం నుండి బిజెపి నాయకులు పరీక్షిస్తూ ముందుకు దూసుకు రావడం చర్చిని అంశంగా మారింది. ఇప్పటికైనా ఆత్మకూరు పట్టణాన్ని రెవెన్యూ డివిజన్ గా ఏర్పాటు చేసేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.



మైనార్టీ నాయకులు సమ్మద్ ప్లే కార్డు ప్రదర్శిస్తూ వేసుకున్న దుస్తుల ద్వారా ప్రదర్శన దృశ్యం



బిజెపి నాయకులు ప్లే కార్డ్స్ ప్రదర్శిస్తున్న దృశ్యం

## కాంగ్రెస్ వైఫల్యాల్ని ఎండగట్టాలి

**- స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తాచాటాలి.. - సర్పంచి అభ్యర్థులతో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి**

**భూత్పూర్,డిసెంబర్ 1,ప్రభాతవార్త :** స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలని సర్పంచి,వార్డు సభ్యుల ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టి బీఆర్ఎస్ బలపరిచే సర్పంచి అభ్యర్థులను అధిక స్థానాల్లో గెలిపించుకోవాలని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు.సోమవారం భూత్పూర్ మండలం మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి స్వగ్రామం అన్నాసాగర్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ముఖ్య నాయకులు,కార్యకర్తల సమావేశంలో ఆల మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఓడిపోయామని అధైర్యపడొద్దని, తెలంగాణ ప్రజలకు బీఆర్ఎస్ పట్ల ఆదరాభిమానాలు ఏమాత్ర తగ్గలేదని,రాబోయే రోజులు బీఆర్ఎస్‌వేనని మాజీ ఎమ్మెల్యే ఆల స్పష్టం చేశారు.దేవరకద్ర నియోజకవర్గంలో అన్ని సర్పంచులు,వార్డు సభ్యులను గెలిపించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అమ్మాపూర్ బీఆర్ఎస్ సర్పంచి అభ్యర్థి మల్లెల బాలరాజు,ఇప్పలపల్లి బీఆర్ఎస్ సర్పంచి అభ్యర్థి పద్మ అడివన్న తదితరులు మాజీ ఎమ్మెల్యే ఆలను కలిశారు.పలుగ్రామాలకు చెందిన నాయకులు మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ భూత్పూర్ మండల అధ్యక్షుడు,మున్సిపల్ మాజీ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్‌తో పాటు నాయకులు సత్తూర్ నారాయణగౌడ్,మొల్గర నర్సింహులు గౌడ్,తూము శ్రీనివాస్‌రెడ్డి,గడ్డం ప్రేమ్‌కుమార్,గడ్డం రాములు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆల

## రైతులు అప్రమత్తంగా ఉండాలి.. దిత్వ తుపాను..

### రైతులకు పోలీసుల సూచనలు

**వంగూరు, డిసెంబర్ 01 ప్రభాతవార్త:**దిత్వ తుఫాన్ ప్రభావం వలన ఏర్పడే నష్టానికి, నష్టం జరగకుండా రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వంగూరు ఎస్ఐ మహేష్ తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రభుత్వ వాతావరణ శాఖ, జిల్లా కలెక్టర్, పోలీసులు విడుదల చేసే హెచ్చరికలను తప్పనిసరిగా గమనించాలని, అపోహాలు, అబద్ధపు వార్తలను నమ్మకూడదన్నారు. రైతులు పండించిన పంట పొలాల్లో ఉన్న, ధాన్యము, పరికరాలు, రసాయనాలు, ఎరువులు సురక్షితమైన ప్రదేశాలకు తరలించాలని, ధాన్యము రోడ్లపై అరబెట్టకుండా వెంటనే గోదాములకు తరలించాలని, గాలివానకు దెబ్బతినే పంటలను ముందుగానే కోయడం లేదా కట్టడి చర్యలు తీసుకోవడం మంచిదని సూచించారు. తుపాను సమయంలో పశువులను బయటకు వదలవద్దని, పశువులను సురక్షితమైన షెడ్లకు తరలించాలని, ఇంటి దగ్గర ఉన్న విద్యుత్ తీగలు తెగిపోయి ఉంటే వాటి దగ్గరకు వెళ్లకూడదాని, కరెంటు స్తంబాలను ముట్టుకోవద్దని ఏదైనా సమస్య ఉంటే స్థానిక విద్యుత్ శాఖ అధికారులకు, పోలీసులకు సమాచారమివ్వాలని అన్నారు. చెరువులు, వాగులు, కాల్వల వద్దకు వెళ్ళకూడదని, వరద ముంపు వచ్చే ప్రమాదం ఉంటే సురక్షిత ప్రాంతాలకు వెళ్ళాలన్నారు. పోలీసుల సూచనలను తప్పక పాటించి, ఎవరికైనా సహాయం అవసరమైతే పోలీసులకు 100కాల్ ద్వారా సమాచారం ఇవ్వాలని తెలిపారు.



ఎస్ఐ మహేష్

## నామినేషన్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలి

**ఉప్పునుంతల, డిసెంబరు 1 ప్రభాతవార్త :** మూడో విడతలో భాగంగా మండలంలో గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు రేపటి నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. మూడో విడత జరగనున్న గ్రామపంచాయతీ ఎలక్షన్లు జరగనున్న నేపథ్యంలో సోమవారం రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో ఎన్నికల మాస్టర్ ట్రైనర్ ఆజ్మతుల్లా మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం, జిల్లా ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు నామినేషన్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలని ఆర్ఓ,ఎఆర్ఓలకు సూచించారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా నామినేషన్లను పూర్తిచేయాలని రిటర్నింగ్ అధికారులకు ఆదేశించారు. నామినేషన్ల స్వీకరణ సమయంలో ఆర్వో, ఎఆర్వో ఏమేమి చెక్ చేయాలో క్షుణ్ణంగా వివరించారు. నామినేషన్ వేయడానికి వచ్చిన అభ్యర్థులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఎన్నికల కమీషన్ మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా పై అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ ఎన్నికల అధికారి, ఎంపిడిఓ వరుణ్ తేజ, మండల పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, ఎంపిడిఓ కార్యాలయం సూపరింటెండెంట్ వెంకటేష్,ఆర్వో లు వెల్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు, వెల్టూర్ ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం.వెంకటయ్య, లక్ష్మాపూర్ హెచ్ఎం వెంకటయ్య, కంసానిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కట్ట మల్లారెడ్డి, ఆర్డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ ఎఇ సాయికృష్ణ, కొరటికల్ పాఠశాల ఉపాధ్యాయులు అశోక్, పిఆర్ ఏఈ మహేష్, విఆర్వోలు శ్రీనివాసులు, లక్ష్మణ్, భాస్కర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, కేశవరావు, బండారు జంగయ్య, రత్నా ప్రసాద్‌లు పాల్గొన్నారు.



ఉప్పునుంతలలో జరిగిన ఆర్వో, ఎఆర్వోల శిక్షణ లో మాట్లాడుతున్న జిల్లా సహాయ ఎన్నికల అధికారి, ఎంపిడిఓ వరుణ్ తేజ

## కనుల పండుగగా గీత జయంతి ఉత్సవాలు

**పెబ్బేరు, డిసెంబరు 1 ప్రభాతవార్త :** గీతా జయంతి సందర్భంగా పెబ్బేరు మున్సిపాలిటీలోని శ్రీశ్రీశ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో గీతా జయంతి ఉత్సవాలను శ్రీశ్రీశ్రీ వేణుగోపాలస్వామి ఆలయ భూమి, సంత పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉదయం నుండి వేణుగోపాలస్వామి వారికి అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా బృందాలచే భగవద్గీత పారాయణ చేయడం జరిగింది. భజనలు చేస్తు శ్రీ కృష్ణ పరమాత్ముని ప్రతిమను, నారాయణస్వామి ప్రతిమలతో పట్టణంలోని వీధులలో శోభాయాత్ర నిర్వహించారు. హోమం, వక్తలచే ప్రవచనాలు అనంతరం భక్తులకు అన్నప్రసాద కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ వేణుగోపాలస్వామి ఆలయ భూమి, సంత పరిరక్షణ కమిటీ సభ్యులకు, శ్రీశ్రీశ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి సేవా సమితి సభ్యులు, శ్రీశ్రీశ్రీ షిరిడి సాయి సేవాసమితి సభ్యులు, హిందూ జాగృతం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



హోమం నిర్వహిస్తున్న భక్తులు

## స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా సాగేందుకు సహకరించండి

### అచ్చంపేట డిఎస్పీ శ్రీనివాస్

**లింగాల, డిసెంబరు 1 ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా సాగేందుకు ప్రజలు సహకరించాలని అచ్చంపేట డిఎస్పీ శ్రీనివాస్ కోరారు. సోమవారం లింగాల మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసి పలు రకాల రికార్డులను పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సమస్యాత్మకమైన గ్రామాల పట్ల ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తయ్యేవరకు గ్రామాలను సందర్శిస్తూ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణకు విఘాతం కలిగించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మూడవ విడత ఈ నెల 3 నుంచి నామినేషన్ ప్రక్రియ, స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. పోలీస్ స్టేషన్ నిర్వహణ, పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేస్తూ ఎస్సై వెంకటేశ్వర్లు గౌడ్‌ను అభినందించారు. డిఎస్పీ వెంట అచ్చంపేట సిఐ నాగరాజు, ఎస్సై వెంకటేశ్వర్లు గౌడ్, బల్మూర్ ఎస్సై రాజేందర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అచ్చంపేట డిఎస్పీ శ్రీనివాస్

## అమెరికా నుంచి వచ్చి సర్పంచ్‌గా పోటీ..!



సర్పంచ్ పదవికి నామినేషన్ దాఖలు చేస్తున్న కమతం నందిని

**బిజినేపల్లి, డిసెంబరు 1 ప్రభాతవార్త:** సర్పంచ్ ఎన్నికల బరిలో దిగేందుకు అమెరికా నుంచి వచ్చి సర్పంచ్‌గా పోటీలో నిలిచిన సంఘటన లట్టుపల్లి గ్రామ పంచాయతీలో చోటుచేసుకుంది. గ్రామాభివృద్ధిలో భాగస్వామి కావాలనే లక్ష్యంతో అదే గ్రామానికి చెందిన కమతం నందిని అమెరికాలో తన కూతురు వద్ద ఉండగా సర్పంచ్ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో రెండు రోజుల క్రితం హుటాహుటిన గ్రామానికి చేరుకున్నారు. గతంలో ఎన్నో మార్లు సర్పంచ్ పదవిలో పోటీ చేయాలని ఉన్న అవకాశం దొరకలేదని, వచ్చిన అవకాశాన్ని వదులుకోకుండా అమెరికా నుండి వచ్చి పోటీలో ఉంటున్నట్లు కమతం శ్రీనివాస్ నందిని రెడ్డి వివరించారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరచడంతో పాటు మౌలిక సదుపాయాల కల్పనలో ముందుంటామని కమతం నందిని వివరించారు.

### గ్రామ పాలన అధికారుల సంఘం

## జిల్లా ప్రధాన కార్యదర్శిగా జర్పలవత్ వినయ్

**కల్వకుర్తి, డిసెంబర్ 01 ప్రభాతవార్త:** నాగర్ కర్నూలు జిల్లా గ్రామ పాలన అధికారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఊర్కొండ మండలం రెడ్య తండాకు చెందిన వినయ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వినయ్ ప్రస్తుతం వెల్దండ మండలం కొట్ర క్లస్టర్‌కు గ్రామ పాలన అధికారిగా విధులు నిర్వర్తిస్తున్నారు. గ్రామ పాలన అధికారుల ఆవిర్భావ సభ తెలంగాణ గ్రామ పాలన అధికారుల సంఘం రాష్ట్ర కమిటీ నేతృత్వంలో నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నట్టు వినయ్ తెలిపారు. ఈ సందర్భంగా వినయ్ మాట్లాడుతూ తనను జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోవడంతో నాతోటి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. గతంలో విద్యార్థి సంఘం నేతగా పనిచేసిన అనుభవంతో ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానని తెలిపారు.



## మినీ బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి మేనేజర్ పి.దేవేందర్

**వెల్దండ, డిసెంబర్ 01 ప్రభాతవార్త:**ఎస్‌బీఐ బ్యాంకు ఖాతాదారులకు సులభమైన వేగవంతంగా సేవలను విస్తృతపరచడానికి మినీ బ్యాంకులను ఏర్పాటు చేస్తున్నామని బ్యాంకు మేనేజర్ పి.దేవేందర్ అన్నారు. మండల కేంద్రంలో ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ సమీపంలో రేవల్లి శ్రీను మినీ బ్యాంకును మేనేజర్ రిబ్బన కట్ చేసి ప్రారంభించారు. ఖాతాదారులు బ్యాంకు సేవలను సద్వినియోగపరచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ శ్రీనివాసరావు, బ్యాంకు సిబ్బంది ప్రవీణ్ కుమార్ రెడ్డి, మనోజ్ కుమార్, రంగయ్య తోపాటు తదితరులు ఉన్నారు.

## రాష్ట్ర ముఖ్యమంత్రిని ఘన స్వాగతం పలికిన దేవరకద్ర ఎమ్మెల్యే

**దేవరకద్ర, డిసెంబరు 1 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డిని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడి మర్యాదపూర్వకంగా కలిసి ఘన స్వాగతం పలికారు. సోమవారం ఆత్మకూరు మున్సిపాలిటీ కేంద్రంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయడానికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ఘన స్వాగతం పలికి, పూలబొకే, శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.



సీఎం రేవంత్ రెడ్డికి ఘన స్వాగతం పలికిన దేవరకద్ర ఎమ్మెల్యే

## ప్రతి గ్రామంలో కాంగ్రెస్ జెండా ఎగరాలి

### దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

**దేవరకద్ర, డిసెంబరు 1 ప్రభాతవార్త:** స్థానిక సంస్థల సర్పంచ్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కష్టపడాలని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో కాంగ్రెస్ జెండా ఎగరేలా కృషి చేయండి. ప్రజలతో మమేకమై పార్టీ అభ్యర్థులను గెలిపించండి అన్నారు. ఐక్యతతో ముందుకు సాగి కాంగ్రెస్ విజయానికి తోడ్పడాలి. ప్రతి కార్యకర్త గ్రామ గ్రామం తిరగాలి, ప్రజల విశ్వాసమే మన బలం, గెలుపే మన లక్ష్యం అని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి పిలుపునిచ్చారు.

# పెండింగ్ సిఎంఆర్ డెలివరీ వేగవంతం చేయాలి

**భాను ట్రేడ్స్ రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేసిన అదనపు కలెక్టర్**

**వనపర్తి, డిసెంబరు 1 ప్రభాతవార్త:** జిల్లాలోని రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి సమర్పించాల్సిన పెండింగ్ సి.ఎం.ఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) డెలివరీ వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్ ఆదేశించారు. సోమవారం మదనపూర్ మండలంలోని భాను ట్రేడ్స్ రైస్ మిల్లును అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రైస్ మిల్లులో నిల్వ ఉన్న ధాన్యం, మిల్లింగ్ జరుగుతున్న తీరును పరిశీలించారు. అనంతరం మిల్లు యజమాన్యంతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు



భాను ట్రేడ్స్ రైస్ మిల్లును తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్

కస్టమ్ మిల్లింగ్ రైస్ (సిఎంఆర్) ను ఎప్పటికప్పుడు వేగంగా పూర్తి చేసి ప్రభుత్వానికి డెలివరీ చేయాలని ఆదేశించారు. డెలివరీలో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల నుండి మిల్లుకు వచ్చిన ధాన్యం లారీలను వెంటనే అన్‌లోడ్ చేయాలని, దీనివల్ల కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం నిల్వలు పెరగకుండా, ప్రక్రియ నిరాటంకంగా కొనసాగడానికి వీలవుతుందని తెలిపారు. ధాన్యం కొనుగోలులో రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా, మొత్తం ప్రక్రియ సజావుగా సాగేందుకు రైస్ మిల్లుల యజమానులు పూర్తి సహకారం అందించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఈ సందర్భంగా కోరారు.

# చాగాపురంలో బిఆర్ఎస్‌పార్టీ నుండి కాంగ్రెస్‌లోకి

**ఇటిక్యాల డిసెంబర్ 1, ప్రభాతవార్త;** మండల పరిధిలోని చాగాపురం గ్రామానికి చెందిన సర్పంచుగా పోటీ చేసే అభ్యర్థి బిఆర్ఎస్ పార్టీ నుండి కృష్ణ, పలువురు కలిసి సోమవారం శాంతినగర్ లోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా వారిని ఏఐసీసీ కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై అలాగే గ్రామ అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో తాజా మాజీ ఉపసర్పంచ్ ప్రకాశం, సర్పంచ్ అభ్యర్థి కృష్ణ, సామెలు, తిరుపాలు తిమ్మప్ప, రాజేష్ సుధాకర్, దేవన్న, యేబు, యెలిషా, మనోహర్, శేషన్న ఉన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ సీనియర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రుక్మానందరెడ్డి, చాగాపురం గ్రామ నాయకులు మాజీ ఎంపిటిసిలు,రాముడు,నరసింహులు, మండల మైనారిటీ అధ్యక్షుడు అల్లా బకాష్, గ్రామ అధ్యక్షుడు చాంద్ బాష,స్వాములు, శాంతన్న, చిన్నా,రవి, కార్యకర్తలు పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్

# రేపే నామినేషన్ల ఉపసంహరణ

**మండల వ్యాప్తంగా 292 సర్పంచుల నామినేషన్లు దాఖలు**

**నవాబుపేట, డిసెంబరు 1 ప్రభాతవార్త :** నామినేషన్ల పరిశీలన కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. నామినేషన్లు ఎక్కువగా ఉండడంతో వాటి పరిశీలన రాత్రి 8:30వరకు సాగింది. రేపు నామినేషన్ల అభ్యర్థుల ఉపసంహరణ బరిలో ఉన్న అభ్యర్థుల గుర్తుల కేటాయింపు జరుగుతుంది. కాగా మండలంలోని దేపల్లిలో వార్డు సభ్యుల నామినేషన్లు వారు వేసిన క్రమ సంఖ్యను దిద్దారంటూ తిరస్కరణకు గురైనట్లు ఆరోపిస్తూ జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. కారుకొండలో కాంగ్రెస్ మద్దతుదారు అఫిడవిట్ లేదని, బీఆర్ఎస్ మద్దతుదారు ఆస్తుల వివరాలు సరిగ్గా ఇవ్వలేదని ఫిర్యాదు చేసుకున్నారు. మండలంలో మొత్తం 42 జీపీల్లో సర్పంచులకు 292, వార్డు సభ్యులకు 865 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో సర్పంచులకు చెందిన 79 నామినేషన్లు, వార్డు సభ్యులకు చెందిన 47 నామినేషన్లు తిరస్కరణకు గురికాగా సర్పంచ్ స్థానాలకు 213, వార్డు స్థానాలకు 818 మంది పోటీలో ఉన్నారు. సర్పంచులకు అత్యధికంగా రుద్రారంలో 14, కూచూర్లో 12, నవాబుపేట, కొండాపూర్, కాకర్లపహాడ్‌లో 11, అతి తక్కువగా దొడ్డిపల్లిలో 2, కారూర్, రేకుల చౌడాపూర్లో 3, పల్లెగడ్డ, కోళ్లగుట్ట తండాలో 4 చొప్పున నామినేషన్లు దాఖలయ్యాయి.

# గీతా కంఠస్థ పోటీల్లో ధన్వాడ విద్యార్థులు

**మూడు విభాగాల్లో టాప్ బహుమతులు**

**ధన్వాడ,డిసెంబరు 1 ప్రభాతవార్త:**ఉమ్మడి పాలమూరు జిల్లా సంస్కృత భారతీ–వాగ్దేవి జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం జరిగిన గీతా కంఠస్థ పోటీల్లో ధన్వాడ శ్రీ సాయి సరస్వతి విద్యామందిర్ చిన్నారులు అదిరిపోయే ప్రతిభను ప్రదర్శించారు. మాధ్యమిక స్థాయిలో కుమారి జి. మధస్విని ప్రథమ బహుమతి, ఉన్నత విభాగంలో కుమారి, జి.నాగచైతన్య ప్రథమ స్థానం, వై.నిహారిక ద్వితీయ స్థానం సాధించి పాఠశాలకు రాష్ట్ర స్థాయి గుర్తింపు తెచ్చారు. వేడుకలో పాలమూరు నర్సింగ్ హోమ్ నిర్వాహకులు డా.భరద్వాజ్, నిర్వాహకులు వెంకటరెడ్డి చేతుల మీదుగా విద్యార్థులు బహుమతులు స్వీకరించారు. పోటీల్లో విద్యార్థుల ప్రతిభ పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల్లో ఆనందాన్ని నింపింది.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

# ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవంపై గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించాలి

**జూనియర్ సివిల్ జడ్జి బి.సాయి మనోజ్**

**నారాయణపేట, డిసెంబరు 1 ప్రభాతవార్త :** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నారాయణపేట సింగారం చౌరస్తాలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి బి.సాయి మనోజ్ న్యాయ విజ్ఞాన సదస్సులో ప్రసంగించారు. ఎయిడ్స్ ఒక తీవ్రమైన వ్యాధి అయినప్పటికీ, అవగాహనతో పాటు నివారణ చర్యలు తీసుకుంటే దాన్ని అరికట్టవచ్చని తెలిపారు. లైంగిక సంబంధాలు, కలుషిత రక్త మార్పిడి, సిరంజిల వినియోగం, తల్లి నుండి బిడ్డకు వైరస్ సంక్రమణ ప్రధాన కారణాలని వివరించారు. 1988 నుంచి ప్రతి సంవత్సరం డిసెంబర్ 1న ఎయిడ్స్ దినోత్సవం నిర్వహిస్తారని గుర్తుచేశారు. ప్రారంభ దశలో హెచ్‌ఐవీ లక్షణాలలో జ్వరం, శరీర నొప్పులు, చర్మ రాష్‌ల రూపంలో కనిపిస్తాయని తెలిపారు. సరైన చికిత్సతో ఎయిడ్స్ బాధితులు ఆరోగ్యకరమైన జీవితం గడపవచ్చని చెప్పారు. బాధితులపై వివక్ష చూపకుండా వారికి సహాయక వాతావరణం కల్పించాలని సూచించారు. ఉచిత న్యాయ సహాయం కోసం 15100 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయ, వైద్య అధికారులు, ఆశా వర్కర్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి బి.సాయి మనోజ్

# మాదాసి-మాదారి కురువ నాయకుల ముందస్తు అరెస్టులు వివాదాస్పదం

**హక్కుల ఉల్లంఘనపై తీవ్ర ఆగ్రహం**

ధన్వాడ, డిసెంబరు 1 ప్రభాతవార్త : రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మక్తల్ నియోజకవర్గ పర్యటన నేపథ్యంలో మాదాసి–మాదారి కురువ సంఘం నాయకులను పోలీసుల ముందస్తు అరెస్టు చేయడం తీవ్ర వివాదంగా మారింది. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే మౌలిక హక్కు కూడా లేకుండా పోయిందా? అనే ప్రశ్నను సంఘం బలంగా లేవనెత్తింది. కొల్లాపూర్ బహిరంగ సభలో మాదాసి, మాదారి, కురువ వర్గాలకు ఎస్సీ కుల ధృవీకరణ పత్రాలు జారీ చేయడానికి కృషి చేస్తానని ఇచ్చిన హామీ సీఎం రేవంత్ రెడ్డి నిలబెట్టుకోలేదని సంఘం ఆక్షేపించింది. ఈ హామీ అమలు చేయాలంటూ మక్తల్ చౌరస్తా వద్ద శాంతియుత నిరసనకు దిగిన నాయకులను అక్రమంగా అరెస్టు చేశారని సంఘం మండిపడింది. రాష్ట్ర మాదాసి–మాదారి కురువ ఎస్సీ సంక్షేమ సంఘం దీనిని అప్రజాస్వామిక చర్యగా ఖండించింది. అరెస్టయిన నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేసింది. సంఘం ధన్వాడ మండల ప్రచార కార్యదర్శి కురువ నవీన్ మాట్లాడుతూ నాయకులను విడుదల చేయకపోతే రానున్న స్థానిక ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో కాంగ్రెస్ అభ్యర్థులకు తగినబుద్ధి చెప్తాం" అని హెచ్చరించారు.

# ఎయిడ్స్ నివారణకు ముందస్తు జాగ్రత్తలు ముఖ్యం

- ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం
- జిల్లా స్థాయిలో అవగాహన కార్యక్రమాలు
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్ 01 ప్రభాతవార్త:** ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో అవగాహన వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో సమీకృత కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు, అధికారులు కలిసి ఎయిడ్స్ నివారణపై ప్రతిజ్ఞ చేశారు. ఎయిడ్స్ నియంత్రణలో సమాజం ప్రతి ఒక్కరి పాత్ర ఎంతో కీలకమని, యువతలో అవగాహన పెంచడం అత్యంత ముఖ్యమని కలెక్టర్ బాదావత్ సంతోష్ ఈ సందర్భంలో పేర్కొన్నారు. అవగాహన సదస్సులో కలెక్టర్ మాట్లాడుతూ హెచ్‌ఐవి మరియు ఎయిడ్స్ గురించి ప్రజలలో ఇంకా తగినంత సమాచారం లేకపోవడం వల్ల



ప్రశంస పత్రం అందజేస్తున్న కలెక్టర్

అపార్థాలు పెరిగుతున్నాయని చెప్పారు. రక్త మార్పిడి సమయంలో సరైన జాగ్రత్తలు పాటిస్తే హెచ్‌ఐవి వ్యాప్తిని అడ్డుకోవచ్చని వివరించారు. ఆసుపత్రులు, రక్త బ్యాంకుల్లో పనిచేసే వైద్య సిబ్బంది తప్పనిసరిగా రక్త నమూనాలను సమగ్రతతో పరీక్షించాలనే సూచనలు ఇచ్చారు. హెచ్‌ఐవి పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యే వ్యక్తులు క్రమం తప్పకుండా చికిత్స తీసుకుంటూ సూచించిన మందులు ఉపయోగిస్తే ఆరోగ్యంగా జీవించవచ్చని పేర్కొన్నారు. హెచ్‌ఐవి ఉన్నంత మాత్రాన వెంటనే ఎయిడ్స్ వస్తుందని భావించకూడదని, మూడు దశల తరువాత మాత్రమే అది ఎయిడ్స్ దశకు మారుతుందని వివరించారు. సరైన సమయంలో మందులు, పోషకాహారం తీసుకోవడం ద్వారా వ్యాధిపై నియంత్రణ సాధ్యమని అన్నారు. ఎయిడ్స్ అనేది అంటువ్యాధి కాదని, బాధితులతో కలిసి జీవించడం, పని చేయడం, చేతులు కలపడం, ఆహారం పంచుకోవడం వల్ల వైరస్ సంక్రమించదని ప్రజల్లో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. బాధితుల్ని వివక్ష లేకుండా ఆదరించడం, మానసికంగా అండగా ఉండటం సమాజ బాధ్యత అని కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లాలో ఎయిడ్స్ నివారణకు వైద్యారోగ్యశాఖ అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని, పల్లె పంచాయతీల స్థాయిలో కూడా అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయని అధికారులు వివరించారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా డీఎంహెచ్‌ఓ ఆధ్వర్యంలోని వైద్య సిబ్బందికి కలెక్టర్ ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రమాదేవి, నాగర్ కర్నూల్ జర్నల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి, డిఎంహెచ్వోఓ డాక్టర్ రవి కుమార్, వైద్యులు మెడికల్ కళాశాల విద్యార్థులు విద్యాశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆంజనేయ... దీవించయ్యా...

**ముస్తాబవుతున్న చిన్న రాజమూరు**

**నేటి నుంచి ఉత్సవాలు ప్రారంభం**

**దేవరకద్ర, డిసెంబరు 1 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలంలోని చిన్న రాజమూరు గ్రామంలో వెలసిన శ్రీశ్రీ ఆంజనేయస్వామి వారి ఉత్సవాలు నేటి నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో శోభయామానంగా అలంకరించారు. ఇందుకోసం ఆలయ చైర్మన్ రాఘవేంద్ర చారి, ఆలయ సిబ్బంది, ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈవో శ్యాంసుందర్ చారి తెలిపారు. నేటి నుంచి 06 వరకు కొనసాగే బ్రహ్మోత్సవాలకు జిల్లా నుంచే కాక కర్ణాటక, మహారాష్ట్ర, నుంచి భక్తులు తరలి వస్తుంటారు. స్వామివారి సన్నిధికి కొందరు భక్తులు ఎద్దుల బండ్లపై, కాలినడకన చేరుకొని మొక్కులు తీర్చుకుంటారు. జాతరకు వచ్చే భక్తులకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

**ఉత్సవాలు ఇలా...**

నేటి నుంచి ధ్వజారోహణం, పంచామృతాభిషేకం, అలంకరణ, పవన హోమం, సాయంత్రం ఏడు గంటలకు శ్రీనివాస కళ్యాణం రాత్రికి హంస వాహన సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. 3న పంచామృతాభిషేకం, అలంకరణ రాత్రికి అశ్వ వాహన సేవ, బ్రహ్మోత్సవం, 4న పౌర్ణమి గురువారం రోజు పంచామృతాభిషేకం, అలంకరణ రాత్రికి గజవాహన సేవ రథోత్సవం భజనలు, సంస్కృతి, బాణాసంచా కార్యక్రమాలు ఉంటాయి. 5న అవతృత స్నానం, పంచామృతాభిషేకం, రాత్రికి పల్లకి సేవ, 6న పంచామృతాభిషేకం, రాత్రికి పల్లకి సేవ, వివిధ సంస్కృతి కార్యక్రమాలు నిర్వహించనున్నారు.





ముస్తాబైన ఆలయం (ఇన్‌సెట్లో) స్వామివారి మూలవిరాట్

**ఏర్పాట్లు పూర్తి...**

**శ్యాంసుందర్‌చారి, ఏవో, దేవరకద్ర**

జాతరకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నాం. జాతరలో పారిశుద్ధ్య చర్యలతో పాటు తాగునీరు వైద్య సేవలను అందుబాటులో ఉంచుతాం. స్వామివారి రథోత్సవానికి వచ్చే వేలాదిమంది భక్తులకు ఇబ్బంది లేకుండా, బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

# అట్టహాసంగా కలిమిచెర్ల రమేష్ ప్రమాణ స్వీకార మహోత్సవం

**కల్వకుర్తి, డిసెంబర్ 1 ప్రభాతవార్త:** వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వీ108 ఏ గవర్నర్‌గా కలిమిచెర్ల రమేష్ అట్టహాసంగా ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో వివిధ జిల్లాల నుండి వాసవి క్లబ్ సభ్యులు, బాధ్యులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. నాగర్‌కర్నూల్‌లోని వంశీ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన మిడిదొడ్డి డిస్కాన్‌లో రమేష్ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు నూలి వెంకటరమణమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ స్థాయిలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ద్వారా చేపట్టిన సామాజిక సేవలను గుర్తించి ఎన్నో ప్రశంసలు, అవార్డులు అందుకున్నామని తెలిపారు. సామాజిక సేవను ప్రతి ఒక్కరు బాధ్యతగా చేపట్టి సమాజంలోని అన్ని వర్గాలకు సహాయం చేయాలని వెంకటరమణమూర్తి కోరారు. అనంతరం ప్రమాణ స్వీకారం చేసిన కలిమిచెర్ల రమేష్‌ను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్లు ఎన్నికల అధికారి జగదీశ్ గుప్తా, జూలూరు రమేష్ బాబు, హకిం రాజేష్, విటాల రామేశ్వర్, గుద్దేటి శివ ప్రసాద్, కలకొండ రాఘవేందర్ గుప్త, కల్వ హరికృష్ణ, మేడిశెట్టి రామకృష్ణ, మీడిదొడ్డి రాధాకృష్ణ, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, కాన్ఫరెన్స్ చైర్మన్ మాచిపెద్ది శివ కుమార్, డిస్టిక్ ఫస్ట్ లేడీ కల్మిచెర్ల స్రవంతి, డిస్టిక్ ఆఫీసర్లు, రీజియన్ చైర్మన్‌లు, జోన్ చైర్మన్‌లు శివ జగదీశ్వర్, చిగుల్లపల్లి శ్రీధర్, మిర్యాల రాజయ్య, వాసా శేఖర్, దాచేపల్లి మనోహర్, సంబు ముత్యాలు, మాజీ పెద్ది రామస్వామి, కొండూరు కృష్ణయ్య, నరసింహులు గుప్త, గందే రవి, వీర బొమ్మ సురేష్, చిదిరే శ్రీనివాస్, బాదం రాఘవేందర్ , మాచీ పెద్ది అశోక్, బాదం హరీష్ ,క్లబ్ అధ్యక్షులు, కోశాధికారులు, సభ్యులు, ఆర్యవైశ్య కుటుంబ సభ్యులు తదితరులతో పాటు పలువురు పాల్గొన్నారు.




వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వీ108 ఏ గవర్నర్‌గా ఎన్నికైన కలిమిచెర్ల రమేష్‌ను సన్మానిస్తున్న దృశ్యం

# వేతనాల పెంపుకై ఆసుపత్రి కార్మికుల ఆందోళన బాట

**ఈ నెల 5న చలో హైదరాబాద్**

**డిమాండ్ నోటిస్ అందజేసిన ప్రభుత్వ జనరల్**

**ఆసుపత్రి, మెడికల్ కళాశాల కార్మికులు**

**వనపర్తి, డిసెంబరు 1 ప్రభాతవార్త:** ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెడికల్ కళాశాలలో కాల పరిమిత ముగిసిన పాత ఐహెచ్ఎఫ్, ఎంఎస్ ఏజెన్సీ టెండర్లను రద్దుచేసి వాటి స్థానంలో నూతన టెండర్ల నోటిఫికేషన్ విడుదల చేయాలని,పారిశుద్ధ్య, సెక్యూరిటీ, పేషెంట్ కేర్, సూపర్‌వైజర్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ ఏఐటియుసి మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన బాట పడుతున్నట్లు తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ తెలిపారు. సోమవారం జీతాల పెంపు కోసం చేపట్టబోయే ఆందోళన డిమాండ్ నోటీసులు వనపర్తి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆర్ఎంఓ డా. శివప్రసాద్ కి, వనపర్తి ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా. మల్లికార్జున కి అందజేశారు. ఈ సందర్భంగా పి. సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వ దవాఖానలో శానిటరీ భద్రత రోగి సంరక్షణ కోసం ప్రభుత్వం మూడు సంవత్సరాలకోసారి ప్రభుత్వం ఐహెచ్ఎఫ్ఎంఎస్ ద్వారా ఏజెన్సీలను ఎంపిక చేసే విధానం అమలు జరుగుతుందని తెలిపారు. 2022 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం టెండర్ల ద్వారా ప్రస్తుత నడుస్తున్న ఏజెన్సీలను నియమించారని వాటి మూడు సంవత్సరాల కాల పరిమితి దాటి ఆరు నెలల గడుస్తున్నదని అయినా ఇప్పటికీ కొత్త ఏజెన్సీల ఏర్పాటు ప్రక్రియని ప్రభుత్వం ప్రారంభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనితో కార్మికులు తీవ్రమైన ఆర్థిక నష్టంతోపాటు మొయ్యలేని పని భారం పెరిగిపోయిందని అన్నారు. గత టెండర్లలో కొన్ని తప్పిదాల కారణంగా ఏజెన్సీ కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా కార్మికుల శ్రమను దోచుకున్నారని అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలకు పెంచుతూ నూతన టెండర్ల నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దీనికోసం రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం 2వ తేదీ నుండి నాలుగో తేదీ వరకు రోజు ఒక గంట ఆసుపత్రుల ఎదుట వివిధ రూపాలలో ఆందోళన కార్యక్రమాలు కొనసాగించి ఈ నెల ఐదున చలో హైదరాబాద్ పేరిట డియంఈ కార్యాలయాన్ని ముట్టడిస్తామని అన్నారు. ఈ కార్యక్రమానికి వెట్టి చాకిరికి గురవుతున్న ఆసుపత్రి కాంట్రాక్ట్ కార్మికుల పెద్ద ఎత్తున తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి బ్రాంచ్ యూనియన్ నేతలు గంధం శ్రీనివాస్, నరసింహ, నరేందర్, కుమార్, అనిల్, శ్రీకాంత్, రవి, శివ, కిషోర్, చంద్రశేఖర్, వెంకటయ్య, భరత్, రవి, పవన్ కళ్యాణ్, కళావతి, జయశ్రీ, ఇందిరా, భాగ్యమ్మ, స్వాతి, లక్షీ ్మ పార్వతి, గోవిందమ్మ, యాదమ్మ, నరసమ్మ, పీరమ్మ, రాజేశ్వరి, లక్షి ్మ, గోవిందమ్మ, సుజాత, రాజేశ్వరి, శారదా, లావణ్య, సైదా బేగం, భారతి, రమ్య, ఈశ్వరమ్మ, శ్రీదేవి, బొజ్జమ్మ, జయలక్షి ్మ, శివలీల, సుధా, లతా, అంజనమ్మ, నరసింహ, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.




సూపరింటెండెంట్‌కు డిమాండ్ నోటీసు అందజేస్తున్న కార్మికులు

# బిసి విద్యార్థులు స్కాలర్షిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలి

**బీసీ హాస్టల్ వార్డెన్ రాజు**

**దేవరకద్ర, డిసెంబరు 1 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండలంలోని 4 ప్రభుత్వ పాఠశాలలో 9 ,10వ తరగతి చదువుతున్న బీసీ, ఈబీసీ విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి ప్రీ మెట్రిక్స్ స్కాలర్షిప్ పథకం కింద 2025,2026వ సంవత్సరానికిగాను నిధులు మంజూరు చేశారని బీసీ హాస్టల్ వార్డెన్ రాజు తెలిపారు. ఒక్క విద్యార్థికి నాలుగు వేల చొప్పున స్కాలర్‌షిప్ అందనుంది. అర్హులైన విద్యార్థులు వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకొని, సంబంధిత పాఠశాలలో అందించాలని సూచించారు. దరఖాస్తుకు ఆధార్ కార్డు,కుల ధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం, బ్యాంకు అకౌంట్ బుక్ అవసరమని పేర్కొన్నారు.

# బాధిత కుటుంబానికి ఎల్‌ఓసి అందజేసిన నాయకులు



బాధితులకు ఎల్‌ఓసి అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**పెబ్బేర్, డిసెంబరు 1 ప్రభాతవార్త :** వనపర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే తూడి మేఘ రెడ్డి సహకారంతో బాధిత కుటుంబానికి గ్రామ కాంగ్రెస్ నాయకులు ఎల్‌ఓసి అందజేశారు. పెబ్బేర్ మండల పరిధిలోని శాఖాపూర్ (వై) గ్రామానికి చెందిన బడదల చిన్న రాముడి ఆపరేషన్ కోసం 2 లక్షల 50వేల ఎల్‌ఓసి పత్రాన్ని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కావలి గోవింద్ చేతుల మీదుగా బాధితుని కుటుంబానికి అందజేశారు. మన గ్రామ ప్రజలకు అండగా ఉంటానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జక్కుల శ్రీను, ఏనుములు మధు, కడుకుంట్ల శ్రవణ్ కుమార్, వాడ సాయికుమార్, తెలుగు బిసన్న, జాలివాల రాజు, బలరాం, ఏనుముల మన్యం, మన్యం తదితరులు పాల్గొన్నారు.


# పంచాయతీ ఎన్నికలకు వెల్లువెత్తిన నామినేషన్లు



నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థులు

**బిజినేపల్లి, డిసెంబరు 1 ప్రభాతవార్త:** ఎన్నికల సంఘం పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటించడంతో గ్రామాల్లో సందడి నెలకొన్నది. ఎన్నికల ప్రక్రియలో భాగంగా రెండో విడత నామినేషన్ల ప్రక్రియలో సోమవారం అభ్యర్థులు నామినేషన్లను భారీగా వేశారు. సాయంత్రం పొద్దుపోయే వరకు క్యూ లైన్ లో నిలుచుని అభ్యర్థులు రిటర్నింగ్ అధికారులకు నామినేషన్ల అందించారు. ఉదయం పదిన్నర నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించాల్సి ఉన్న అభ్యర్థులు క్యూలైన్లలో నిలవడంతో వారి నుండి పొద్దు పోయే వరకు నామినేషన్లు తీసుకున్నారు.

# రెండవ రోజు సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్



నామినేషన్ దాఖలు చేస్తున్న అభ్యర్థులు

**దామరగిద్ద, డిసెంబరు 1 ప్రభాతవార్త :** స్థానిక సంస్థ ఎన్నికల్లో భాగంగా దామరగిద్ద మండలంలో సర్పంచ్ వార్డు సభ్యుల రెండవ రోజు సోమవారం మండలంలోని సర్పంచ్ స్థానాలకు, వార్డు సభ్యులకు నామినేషన్లు వచ్చినట్లు మండల అభివృద్ధి అధికారిణి సాయిలక్షి ్మ తెలిపారు. సర్పంచ్ అభ్యర్థులుగా దామరగిద్ద గ్రామానికి సర్పంచ్ అభ్యర్థులుగా భీమయ్యగౌడ్, కాంగ్రెస్ తరపున కనికిరెడ్డి, లింగారెడ్డిపల్లి గ్రామానికి సర్పంచ్ అభ్యర్థిగా కాంగ్రెస్ తరపున కె. శ్రీనివాస్ నామినేషన్ దాఖలు చేశారు.

## డాక్టరేట్ పట్టా పొందిన అంబటి వినోద్

**మణిపూర్ యూనివర్సిటీ నుండి గౌరవ డాక్టరేట్ పట్టా**

**వనపర్తి, డిసెంబరు 1 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన జాగృతి కాలేజీ యజమాని అంబటి వినోద్ విద్యారంగంలో రసాయన శాస్త్రంలో విశిష్ట సేవలకు గుర్తింపుగా ఏషియన్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ గ్లోబల్ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ మణిపూర్ నుండి డాక్టరేట్ పట్టా పొందారు. సోమవారం వనపర్తి పట్టణంలోని జాగృతి కాలేజీ యజమాన్యం విద్యార్థుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి ఎర్ర అంజయ్య, డా.నిరంజన్ అయ్యా, డా.బండారి శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్య రంగాల్లో గత 25 సంవత్సరాలుగా విద్యావ్యవస్థలో అలుపెరగని పోరాటం చేస్తూ అపజయం ఎరుగని విక్రమార్కుడిలాగా వేల సంఖ్యలో విద్యార్థులకు రసాయన శాస్త్రాన్ని బోధిస్తూ ఎంతోమంది విద్యార్థులను ఇంజనీర్లుగా, డాక్టర్లుగా వివిధ రంగాలలో ప్రభుత్వ ఉద్యోగులుగా తీర్చిదిద్దిన కృషివల్యుడు, వందల సంఖ్యలో నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్న గొప్ప మానవతవాదికి ఏషియన్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ గ్లోబల్ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ నుండి డాక్టరేట్ స్వీకరించిన అంబటి వినోద్ కుమార్ అని కొనియాడారు. విద్యా రంగంలో అయినా సేవలకు గుర్తింపుగా యూనివర్సిటీ వారు డాక్టరేట్ పట్టా ప్రధానం చేశారు అని అన్నారు. భవిష్యత్తులో విద్యార్థులు అవార్డులు అందుకని ఉన్నత స్థానంలో ఉండాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ యజమాన్యం భాగ్యస్వాములు శ్యామ్, సత్యనారాయణ, భాస్కర్, కాలేజీ ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు



అంబటి వినోద్‌ను సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

## రాత్రి వరకు కొనసాగిన నామినేషన్ల స్వీకరణ

**- 45 సర్పంచ్, 148 వార్డులకు నామినేషన్లు..**

**- రాత్రి వరకు క్యూలైన్‌లలో అభ్యర్థులు**

**చిన్నచింతకుంట ,డిసెంబరు1 ప్రభాత వార్త:** మండలంలో సర్పంచ్, వార్డు సభ్యుల కు నామినేషన్లు స్వీకరణ రాత్రి వరకు కొనసాగింది. మండలంలోని 4 నామినేషన్ కేంద్రాల్లో సర్పంచ్, వార్డు సభ్యులకు గాను నామినేషన్లు వేసేందుకు బారులు తీరారు. చిన్నచింతకుంట నామినేషన్ కేంద్రంలో రాత్రి 8:30 వరకు నామినేషన్ ప్రక్రియ కొనసాగింది. మంగళవారం చివరి రోజు కావడంతో సర్పంచ్ వార్డులకు గాను నామినేషన్ వేసేందుకు ఎక్కువ సంఖ్యలో అభ్యర్థులు రానున్న నేపథ్యంలో ఆయా నామినేషన్ కేంద్రాల్లో రిటర్నింగ్ అధికారుల సంఖ్యను పెంచాలని సర్పంచ్, వార్డులకు పోటీ చేసే అభ్యర్థులు కోరుతున్నారు. అధికారులు తక్కువ.. నామినేషన్ వేసే అభ్యర్థులు ఎక్కువ కావడంతో రాత్రి వరకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగడంపై పలువురు అభ్యర్థులు అసంతృప్తి వ్యక్తం చేశారు. చివరి రోజు అభ్యర్థులకు ఇబ్బంది కలగకుండా ఎక్కువ సంఖ్యలో అధికారులను నియమించాలని కోరుతున్నారు. లాల్ కోట నామినేషన్ కేంద్రంలో సర్పంచ్ కు 15, వార్డ్ మెంబర్ కు 39, వడ్డేమాన్ నామినేషన్ కేంద్రంలో సర్పంచ్ కు 8 ,వార్డు మెంబర్లకు 37, చిన్నచింతకుంట నామినేషన్ కేంద్రంలో సర్పంచ్ కు 8, వార్డు మెంబర్లకు 39, అమ్మాపూర్ నామినేషన్ కేంద్రంలో సర్పంచ్ కు 14, వార్డ్ మెంబర్లకు గాను 33 నామినేషన్లు రావడం జరిగింది. 45 సర్పంచ్ 148 వార్డు సభ్యులకు నామినేషన్లు వచ్చాయని తహసిల్దార్ ఎల్లన్న, ఎంపీడీవో లక్ష్మీ నరసింహులు తెలిపారు.

## ఒప్పంద అధ్యాపకులను క్రమబద్దీకరించాలి

**- పీయూ జేఏసీ డిమాండ్**

**మహబూబ్‌నగర్ డిసెంబర్1,ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో 12 యూనివర్సిటీలలో పనిచేసున్న 1245 మంది ఒప్పంద అధ్యాపకులను క్రమబద్దికరించాలని పాలమూరు విశ్వవిద్యాలయ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. పాలమూరు యూనివర్సిటీ పీజీ కాలేజీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గతం లో సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఉద్యోగ భద్రత తో కూడిన యూజీసీ పే స్కేల్స్ బేసిక్ పే, ఎచ్ఆర్ఏ, డిఏ, 3 ఇంక్రిమెంట్ తక్షణమే ఇవ్వాలని, ఈనెల 7న సీఎం ఓయూ రాకను స్వాగత్తిస్తున్నామని, అప్పుడు సీఎం తీపి కబురు అందించాలని కోరారు. అదేవిధంగా ఒప్పంద అధ్యాపకుల రాష్ట్ర జేఏసీ ఓయూలో తలపెట్టిన ..ఒప్పంద అధ్యాపకుల విన్నప సభలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సంఘం నాయకులు డా.రవికుమార్ అన్నారు. కార్యక్రమంలో డా శ్రీనివాస్, డా సుదర్శన్ రెడ్డి, డా చెన్నయ్య పాల్గొన్నారు.

## విద్యార్థులకు అభినందన

**జడ్చర్ల, డిసెంబర్1,ప్రభాతవార్త:** రాష్ట్రస్థాయి కరాటే పోటీలలో ప్రతిభ కనబర్చిన కొడుగల్ పాఠశాలకు చెందిన విద్యార్థులను నాయకులు అభినందించారు. పోటీల్లో బంగారు పతకం సాధించిన విద్యార్థిని శిల్పను ప్రార్ధన సమయంలో ఉపాధ్యాయులు అభినందించారు. అదేవిధంగా రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొని వచ్చిన క్రీడాకారులకు గ్రామ సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు రాంరెడ్డి షూస్‌ను, స్పైక్స్ అందజేశారు. వీరికి ప్రశంసా పత్రం షూస్ ను అందజేస్తూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మారేపల్లి శ్రీనివాసులు రాష్ట్రస్థాయిలోనే కాకుండా జాతీయస్థాయిలో పాల్గొని బహుమతులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లు అశోక్, రవి కుమార్ గౌడ్, షహీన్, కృష్ణయ్య, అమరేందర్ రెడ్డి, ఉమాదేవి , అనసూయ, శశిధర్, కరుణాకర్, శరణప్ప, శ్రీనివాస శెట్టి, గోవర్ధన్, ఆంజనేయులు, మల్లికార్జున, లింగం కృష్ణయ్య అంజలీ తాహెర్ బాలచంద్రుడు పాల్గొన్నారు.

### కొడంగల్-నారాయణపేట-మక్తల్ ఎత్తిపోతల

# రెండేండ్లలో పూర్తి చేస్తాం

మొదటి పేజీ తరువాయి భాగం..

ప్రాజెక్టు పూర్తి చేయాలని, అధికారులు 24గంటలు పని చేయాలని లేదంటే వీపు విమానం మోత మోగుతుందన్నారు. ఏ వరుసలో కూర్చున్న వడ్డించే బాధ్యత తనదే అన్నారు. ఇరిగేషన్ కాదు,,ఎడ్యుకేషన్ కూడా బాధ్యతగా తీసుకున్నామని విద్యకు సైతంఅధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. రూ.200కోట్లతో ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను ప్రారంభించబోతున్నట్లు తెలిపారు.

నా ఇంట్లో నా మనుమడు సన్నబియ్యం తింటే మా అక్కలు, చెల్లెండ్లు వాళ్ల బిడ్డలు సన్నబియ్యం తింటున్నారని, కరెంట్ బిల్లులు కూడా లేకుండా చేశామన్నారు. బస్సు కూడా ఉచితంగా ఇచ్చామని చెప్పారు. బస్సులకు ఆడబిడ్డలను ఓనర్లు చేశామని చెప్పారు.

**యెన్నంను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..**

" విద్యా రంగానికి దిశా నిర్దేశం చేస్తూ, ప్రజల అవసరాలను లోతుగా అంచనా వేసే నాయకత్వ గుణాలు కలిగిన యెన్నం శ్రీనివాస్ రెడ్డి సూచనలను పరిగణనలోకి తీసుకొని, వెనుకబడిన మహబూబ్ నగర్ జిల్లాకు ఐఐటి కళాశాలను మంజూరు చేయడం జరిగింది. సమాజ అభ్యున్నతిని నిశ్శబ్దంగా, కానీ దృఢంగా ముందుకు తీసుకువెళ్లే ఆయన తీరు విద్యా అవకాశాల విస్తరణలో స్పష్టమైన మార్గదర్శకంగా నిలుస్తోంది. మహబూబ్ నగర్ బిడ్డలకు ఉన్నత విద్యను అందించాలనే ఆయన చిరకాల స్వప్నాన్ని గౌరవించి, ఈ నిర్ణయం తీసుకున్నాం. యెన్నం శ్రీనివాస్ రెడ్డిది కేవలం పదవి కోసం చేసే రాజకీయాలు కాదు, ప్రజా సంక్షేమం కోసం, ముఖ్యంగా విద్యాభివృద్ధి కోసం పరితపించే దృక్పథం. ఆయన పట్టుదల, ఈ జిల్లా అభివృద్ధిపై ఆయనకు ఉన్న నిబద్ధత కారణంగానే ట్రిపుల్ ఐటీ కళాశాల ఇక్కడికి వచ్చింది. ఇందుకు మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డికు ప్రత్యేక అభినందనలు.""ఈ విద్యా సంస్థ ద్వారా మహబూబ్ నగర్ విద్యార్థుల భవిష్యత్తు బంగారు బాట పట్టనుంది. ఈ ఘనతలో యెన్నం శ్రీనివాస్ రెడ్డి కృషి ఎంతో గొప్పది." అని వ్యాఖ్యానించారు.

పడమటి ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

**స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించిన సీఎం**

నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలో వెలిసిన శ్రీశ్రీశ్రీ పడమటి ఆంజనేయ స్వామి దేవాలయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం పట్టణానికి హెలికాప్టర్ ద్వారా మక్తల్ పట్టణానికి వచ్చిన ముఖ్యమంత్రి హెలిప్యాడ్ దిగిన తర్వాత నేరుగా పట్టణంలో వెలిసిన శ్రీ పడమటి ఆంజనేయ స్వామి ఆలయానికి రోడ్డు మార్గం ద్వారా వెళ్లి దర్శించుకున్నారు. ఆలయంలో సీఎం పేరిట అర్చన చేసిన అర్చకులు ఆయనను వేదమంత్రాలతో ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అంతకుముందు ఆయనకు మక్తల్ పట్టణ అంబేద్కర్ చౌరస్తాలో గజమాలతో ఘనంగా సత్కరించడం జరిగింది. అనంతరం సభా సమావేశానికి తిరిగి హాజరై పట్టణంలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. అంతకు ముందు సీఎం ఎ.రేవంత్ రెడ్డికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మంత్రులు డా. వాకాటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లా ఇంచార్జీ మంత్రి దామోదర రాజనర్సింహతో పాటు ఉమ్మడి పాలమూరు జిల్లా ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



ఆంజనేయస్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించడానికి వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

## జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

**వనపర్తి, డిసెంబరు 1 ప్రభాతవార్త:** జిల్లాలో శాంతి భద్రతలను మరింత బలోపేతం చేయడం, ప్రజా వాతావరణం ప్రశాంతంగా కొనసాగడం, అనవసర గుమికూడి గుంపులు నివారించడం లక్ష్యంగా డిసెంబర్ 01 నుంచి డిసెంబర్ 31 వరకు 30 పోలీస్ యాక్ట్-1861 నిబంధనలు అమల్లో ఉంటాయని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ వనపర్తి జిల్లా పరిధిలో ఎవరైనా పోలీసు ఉన్నతాధికారుల ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, ర్యాలీలు, బహిరంగ సభలు, భారీ స్థాయి సమావేశాలు నిర్వహించడం కఠినంగా నిషేధం. ప్రజా జీవనాన్ని అంతరాయం కలిగించే, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఏ చర్యకైనా చోటులేదు" అని స్పష్టం చేశారు. అలాగే "30 పోలీస్ యాక్ట్" ఉల్లంఘనలకు చట్టంలో స్పష్టమైన శిక్షలు ఉన్నాయి. అనుమతి లేకుండా కార్యక్రమాలు చేపట్టిన వారిపై ఎటువంటి మినహాయింపు లేకుండా చర్యలు తీసుకుంటాం. నిబంధనలు ప్రజల భద్రత కోసం పెట్టబడ్డాయి. అందరూ తప్పనిసరిగా పాటించాలి" అని హెచ్చరించారు. ఏ కార్యక్రమం కావాలన్నా ముందుగానే దరఖాస్తు చేసి అనుమతి పొందండి. ప్రజల సహకారం వల్లనే శాంతిభద్రతలు నిలుస్తాయి. పోలీసుల చర్యలు ప్రజల రక్షణ కోసమేనని ఎస్పీ తెలిపారు.



జిల్లా ఎస్పీ సునీత రెడ్డి (ఫైల్)

**ముందస్తు అనుమతి లేని ర్యాలీలు, సభలకు పూర్తి నిషేధం**

**శాంతిభద్రతల పరిరక్షణే ప్రధాన ధ్యేయం**

**ప్రజా శాంతి భద్రతలకు భంగం కలిగించే కార్యక్రమాలు పూర్తిగా నిషేధం**

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చట్టపరమైన కఠిన చర్యలు తప్పవు**

**ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి సమావేశాలు నిర్వహించవద్దు**

**జిల్లా ఎస్పీ సునీత రెడ్డి**

## ఉమ్మడి ఇటిక్యాల,ఎర్రవల్లి,మండలాల్లో 7నామినేషన్ కేంద్రాలు

**ఇటిక్యాల డిసెంబర్ 1,ప్రభాతవార్త;** ఉమ్మడి ఇటిక్యాల మండలంలోని ఇటిక్యాల కొత్త ఎర్రవల్లి మండలంలో 29 గ్రామ పంచాయతీలు ఉండగా మూడో విడత లో జరిగే ఎన్నికల కోసం 7 నామినేషన్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఇటిక్యాల మండలానికి సంబంధించి చాగాపురం గ్రామపంచాయతీ కేంద్రంలో చాగపురం తో పాటు షాబాద్. బుద్దారెడ్డిపల్లి,శనగపల్లి గ్రామాలకు చెందిన సర్పంచులు వార్డ్ మెంబర్లుగా పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ వేయాల్సి ఉంటుంది. అలాగే వుదండపురం గ్రామపంచాయతీ కేంద్రంలో నాలుగు గ్రామాల సర్పంచ్ వార్డ్ మెంబర్ల అభ్యర్థులు నామినేషన్ వేసి వేసేందుకు గాను ఏర్పాటు చేపట్టారు. దండాపురం తోపాటు సాతర్ల, వావిలాల, పెద్దదిన్నె, గ్రామాల అభ్యర్థులు ఇక్కడ నామినేషన్ వెయ్యాలి. అలాగే ఇటిక్యాల మండల కేంద్రంలో ఆరు గ్రామపంచాయతీలకు సంబంధించి సర్పంచ్ వార్డ్ మెంబర్ల అభ్యర్థులు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో గల ఎంఆర్సి కార్యాలయంలో నామినేషన్ వేసేందుకు ఏర్పాటు చేశారు. ఇటిక్యాలతోపాటు శివనంపల్లి, మునగాల నక్కలపల్లి, గోపాల్ దిన్నె,మొగలి రావాల్ చెరువు. గ్రామాలకు చెందిన సర్పంచ్ వార్డ్ మెంబర్లు అభ్యర్థులు నామినేషన్ ఈ కేంద్రంలో వేయాల్సి ఉంటుందని అభ్యర్థులు ఎన్నికల నియమాలు ప్రకారం ప్రతి బాధకులతో పాటు అభ్యర్థులు రిటర్నింగ్ అధికారులకు నామినేషన్ దాఖలు చేయాలని ఎంపీడీవో మహ్మద్ అజార్ మోహియుద్దిన్ తెలిపారు..ఎర్రవల్లి మండలానికి సంబంధించి 15 గ్రామ పంచాయతీలు ఉండగా ఎర్రవల్లి పదవ బెటాలియన్ లోని పాఠశాలలో 5 గ్రామపంచాయతీలో 5 నామినేషన్ కేంద్రం ఏర్పాటు చేయగా బీచుపల్లి, ఎర్రవల్లి, కొండేరు,జింకలపల్లి, బి వీరాపురం గ్రామాలకు చెందిన సర్పంచ్ వార్డ్ మెంబర్లు అభ్యర్థులు ఇక్కడ నామినేషన్ దాఖలు చేయాలని ఎంపీడీవో అబ్దుల్ సయ్యద్ ఖాన్ తెలిపారు. అలాగే ఎర్రవల్లి పదవ బెటాలియన్ లోని ఉన్నత పాఠశాలలో రెండవ నామినేషన్ కేంద్రం ఏర్పాటు చేయగా ఈ కేంద్రంలో తిమ్మాపురం ఈ కేంద్రంలో తిమ్మాపురం. ఆర్. గార్లపాడు. సా సనూల్. షెకుపల్లి గ్రామాల అభ్యర్థులు వార్డు మెంబర్లు నామినేషన్ వేయాల్సి ఉంటుంది. ధర్మవరం గ్రామపంచాయతీ కేంద్రంలో ధర్మవరం. తోపాటు వల్లూరు గ్రామాల అభ్యర్థులు నామినేషన్ పేషెందుకు ఇక్కడ ఏర్పాటు చేశారు. అంతేకాక కోదండపురం గ్రామపంచాయతీ కేంద్రంలో పుటాన్ దొడ్డి, వేముల, బట్లదిన్నె, కోదండపురం పంచాయతీ కి సంబంధించి గ్రామాల సర్పంచ్. వార్డ్ మెంబర్లు అభ్యర్థులు ఆ కేంద్రాలలో నియమించిన ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు నామినేషన్ దాఖలు చేయాల్సి ఉంటుందని ఎంపీడీవో అబ్దుల్ సయ్యద్ ఖాన్ తెలిపారు.

## డిసెంబర్ 3 నుండి 5 వరకు మూడవ విడత సర్పంచ్‌ల నామినేషన్లు

**6న పరిశీలన. 8 వరకు నామినేషన్‌ల ఉపసంహరణ ,17న పోలింగ్. అదే రోజు మధ్యాహ్నం ఫలితాలు**

ఇటిక్యాల డిసెంబరు 1, ప్రభాతవార్త; ఉమ్మడి ఇటిక్యాల, కొత్త ఎర్రవల్లి మండలంలో 29 గ్రామపంచాయతీలు ఉండగా 274 వార్డులు కలవు. ఈ పంచాయతీలకు ఇటీవల ఎన్నికల కమిషన్ ఆదేశాలు మేరకు వార్డు మెంబర్లు సర్పంచులకు రిజర్వేషన్లను ఆయా కేటగిరి లుగా ఖరారు చేశారు. ఇటిక్యాల మండలంలో 14 గ్రామపంచాయతీలు 130 వార్డులు ఉండగా. కొత్త ఎర్రవల్లి మండలంలో 15 గ్రామ పంచాయతీలు 144 వార్డులు ఏర్పాటు చేశారు. అలాగే ఇటిక్యాల మండలంలో మొత్తం ఓటర్లు 18,969 మంది ఉండగా ఇందులో 9,586 మంది స్త్రీలు. 9.382 మంది పురుష ఓటర్లు ఉన్నారు. కొత్త ఎర్రవల్లి మండలంలో 23.345 మంది ఓటర్లు ఉండగా ఇందులో 11,810 మంది స్త్రీలు. 11,535 మంది పురుష ఓటర్లు ఉన్నారు.3 నుండి 5 వరకు మూడవ విడత నామినేషన్లు. ఉమ్మడి ఇటిక్యాల మండలంలో 29 గ్రామపంచాయతీలో సర్పంచ్ ల ఎన్నికల నిర్వహణ కోసం కోసం మూడవ విడత లో భాగంగా డిసెంబర్ 3 తేదీ నుండి 5వ తేదీ వరకు నామినేషన్ స్వీకరిస్తుండగా 6న పరిశీలన. 7.8. తేదీ వరకు నామినేషన్ల విత్ డ్రా అలాగే నామినేషన్లపై అప్పీలుకు వెళ్లే అవకాశం ఉండగా 9వ తేదీ సర్పంచులుగా. వార్డ్ మెంబర్లుగా పోటీలో ఉన్న అభ్యర్థులకు గుర్తుల ను కేటాయించనున్నారు. అలాగే 17న ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ నిర్వహించి అనంతరం మధ్యాహ్నం తర్వాత ఓట్ల లెక్కింపు జరిపి ఫలితాలు ప్రకటిస్తారు. అదే రోజు గెలిచిన వార్డు మెంబర్ల నుండి ఉపసర్పంచ్ గా ఎన్నిక నిర్వహిస్తారు. ఆరోజు ఫోరం లేక వాయిదా పడితే మరుసటి రోజు నిర్వహించే అవకాశం ఉంటుంది.

## నామినేషన్ల స్వీకరణకు తొమ్మిది కేంద్రాలు : ఎంపిడీఓ చంద్రశేఖర్

**లింగాల, డిసెంబరు 1 ప్రభాతవార్త:** లింగాల మండలంలో మూడవ విడతలో జరిగే స్ధానిక సంస్థల ఎన్నికల్లో ఆయా గ్రామాల సర్పంచులు, వార్డు సభ్యుల నామినేషన్ స్వీకరణకు ఎనిమిది కేంద్రాలతో పాటు ఒకటి రిజర్వుడ్ మొత్తం తొమ్మిది కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంపిడిఓ చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం లింగాల మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల సామాగ్రిని క్షుణ్ణంగా పరిశీలించారు. మండలంలోని 23 గ్రామ పంచాయతీలకు 8 క్లస్టర్లను ఏర్పాటు చేసి,ఒకటి రిజర్వుడ్ కింద కేటాయించారు. మూడవ విడతలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలు డిసెంబర్ 3 నుండి నామినేషన్లను స్వీకరించనున్నట్లు తెలిపారు. లింగాల క్లస్టర్‌లో లింగాల, పద్మనపల్లి గ్రామపంచాయతీల అభ్యర్థుల నుండి నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా సురాపురం క్లస్టర్‌లో సురాపూర్,మగ్దుంపూర్, కొత్తకుంటపల్లి గ్రామ పంచాయతీలకు సంబంధించిన అభ్యర్థుల నామినేషన్ స్వీకరిస్తారు. అంబటిపల్లి క్లస్టర్ పరిధిలోని అంబటిపల్లి, కేసీతాండ, అవుసలికుంట, శాయిన్ పేట గ్రామపంచాయతీల నామినేషన్ స్వీకరిస్తారు. రాయవరం క్లస్టర్ లో ధారారం, క్యాంప్ రాయవరం, రాయవరం గ్రామ పంచాయతీ నుండి నామినేషన్ దాఖలు చేస్తారు. అప్పాయిపల్లి క్లస్టర్‌లో అప్పాయిపల్లి, ఎంసి తండా,శ్రీరంగాపురం చెన్నంపల్లి గ్రామపంచాయతీలో నామినేషన్ దాఖలు చేస్తారు. రాంపూర్ క్లస్టర్‌లో బాకారం, రాంపూర్, వల్లభాపూర్ గ్రామపంచాయతీల అభ్యర్థుల నుండి నామినేషన్ స్వీకరిస్తారు. కోమటికుంట క్లస్టర్లో కోమటికుంట, దత్తారం, జిలుగుపల్లి గ్రామపంచాయతీల అభ్యర్థుల నుండి అదే విధంగా, అప్పాపూర్ పెంట క్లస్టర్‌లో అప్పాపూర్ పెంటను ఏర్పాటు చేశారు. అదే విధంగా ఒకటి క్లస్టర్‌ను రిజర్వుడు కింద ఏర్పాటు చేశారు. 23 గ్రామ పంచాయతీలకు సంబంధించిన అభ్యర్థుల నుండి స్టేజ్ వన్ క్లస్టర్లు అధికారులు నామినేషన్లు స్వీకరిస్తారు.



మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల సామగ్రిని పరిశీలిస్తున్న ఎంపిడిఓ చంద్రశేఖర్. ఎంపిఓ, సిబ్బంది


## వల్లూరు పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో

**జడ్చర్ల, డిసెంబర్1,ప్రభాతవార్త:** మండలంలోని వల్లూరు ప్రాథమిక పాఠశాల, ఉదండాపూర్ పాఠశాలలను ఎంఈవో కే మంజుల దేవి సందర్శించారు. ఫౌండేషనల్ లెర్నింగ్ స్టడీలో భాగంగా 3వ తరగతి విద్యార్థుల తెలుగు, గణిత సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాల స్థాయి పట్ల వారు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పాఠశాలలలో క్యాంపెయిన్ 5.0 కార్యక్రమంలో చేపట్టిన కార్యక్రమాలను పరిశీలించారు. అదేవిధంగా విద్యార్థులకు జనరేట్ చేయడం 100శాతం పూర్తిచేయాలని, డ్రాప్ బాక్స్ క్లియరెన్స్, యూనిఫాం ఆన్‌లైన్ ఎంట్రీ వంటి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.




విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈవో

## హోరాహోరీగా సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్లు



నామినేషన్ దాఖలు చేస్తున్న కౌకుంట్ల సర్పంచ్ అభ్యర్థి



అధికారులు రాత్రి వరకు కొనసాగుతున్న నామినేషన్ల స్వీకరణ

**దేవరకద్ర, డిసెంబరు 1 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండల కేంద్రంలో 12 గ్రామ పంచాయతీలు, 106 వార్డులకు రెండో దశలో నిర్వహించే ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ పర్వం రెండో రోజైన సోమవారం రాత్రి వరకు కొనసాగింది. వాస్తవానికి నామినేషన్ల దాఖలుకు సాయంత్రం ఐదు గంటల వరకే గడువు ఉంది. అయితే కొన్ని గ్రామాలు నామినేషన్లు దాఖలు చేసేందుకు సాయంత్రం పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఐదు గంటల వరకు వచ్చిన వారందరి నుంచి స్వీకరించాలని నిర్ణయించారు. ఈ ప్రక్రియ పూర్తయ్యేసరికి బాగా రాత్రయింది. సర్పంచులు, వార్డు సభ్యుల స్థానాలకు పార్టీల మద్దతుదారులు భారీ సంఖ్యలో దాఖలు చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయం నుంచి మండలంలోని క్లస్టర్ కార్యాలయానికి అభ్యర్థులు తరలివచ్చి సందడి వాతావరణాన్ని నెలకొల్పారు. అధికారుల పర్యవేక్షణలో పారదర్శకంగా నామినేషన్లు స్వీకరించగా కౌకుంట్ల మండల పరిధిలోని అప్పంపల్లి 02 సర్పంచ్, 19 వార్డు సభ్యులు, కౌకుంట్ల 06 సర్పంచ్, 24 వార్డు సభ్యులు, పుట్టపల్లి 01 సర్పంచ్, 09 వార్డ్ సభ్యులు, రేకులం పల్లి 06 సర్పంచ్, 05 వార్డ్ సభ్యులు, వెంకటగిరి 03 సర్పంచ్ ,05 వార్డు సభ్యులు,

## కొండేరు గ్రామంలో బెల్ట్ షాప్‌పై దాడి కేసు నమోదు

**ఇటిక్యాల డిసెంబర్ 1, ప్రభాతవార్త;** మండల పరిధిలోని కొండేరు గ్రామంలో అక్రమంగా అనుమతులు లేకుండా ఓ వ్యక్తి నిర్వహిస్తున్న బెల్టు షాపుపై సోమవారం ఎస్సై కే. రవి నాయక్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బందితో కలిసి బెల్ట్ షాపుపై దాడి నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎర్రవల్లి మండల పరిధిలోని కొండేరు గ్రామంలో ఓ వ్యక్తి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా మద్యం అమ్ముతున్న షాప్ లో ఎస్సై.ఐ. కే. రవి నాయక్ సిబ్బందితో కలసి దాడి చేపట్టగా బెల్ట్ షాప్ లో 11.33 లీటర్ల మద్యం దొరకగా మద్యం విలువ సుమారు 5 వేల 280 రూపాయల విలువ ఉంటుందని షాప్ యజమాని పై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్.ఐ.కే.రవి తెలిపారు.

## రైతులను అప్రమత్తత చేయండి

మొదటి పేజీ తరువాయి భాగం..

కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యం తడవకుండా అవసరమైన తాట్పాళ్ళను రైతులకు అందుబాటులో ఉంచాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన సహాయ చర్యలు తీసుకోవాలని, వరి, పత్తి రైతులను అప్రమత్తం చేస్తూ అధికారులు కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఈ సందర్భంగా ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి అమరేందర్,జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్ రావు, పిడి డిఆర్డిఏ చిన్న ఓబులేసు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి నరసింహారావు, మార్కెటింగ్ శాఖ అధికారి తదితరులు పాల్గొన్నారు.

## ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకం



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఎన్నికల అధికారులు

మొదటి పేజీ తరువాయి భాగం..

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో నిర్వహించిన ప్రిసైడింగ్ అధికారుల శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రిసైడింగ్ అధికారులు తమ విధులు, బాధ్యతలపై పూర్తి అవగాహన పెంచుకుని పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని సూచించారు. పిఓ,ఏపీవోలు పోలింగ్ రోజు చేపట్టాల్సిన విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. తహసిల్దార్ మోహన్, ఎంపీడీవో ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాలి

మొదటి పేజీ తరువాయి భాగం..

సెంటర్‌ను సోమవారం సందర్శించారు ఈ సందర్భంగా ఆమె మీడియా సెంటర్ యొక్క పనితీరును పరిశీలించారు. సంబంధిత అధికారులతో మాట్లాడుతూ ఎప్పటికప్పుడు గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు అందించాలని అన్నారు. ప్రతిరోజు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో వస్తున్న వార్తలను పరిశీలించి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌కు సంబంధించిన వార్తలను గుర్తించి సంబంధిత అధికారులకు తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మీడియా నోడల్ అధికారి, జిల్లా పౌర సంబంధాల అధికారి పి శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ కృష్ణయ్య,సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రతి అభ్యర్థికి ఎన్నికల వ్యయముల ఖాతా

## పత్రాలను విధిగా అందజేయాలి

మొదటి పేజీ తరువాయి భాగం..

అభ్యర్థులు సంబంధిత గ్రామ పంచాయతీకి చెల్లించాల్సిన పన్నులను పెండింగ్ లేకుండా కట్టించుకోవాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి, ఇతర అంశాలపై ముద్రించిన పత్రాలను నామినేషన్ వేసిన వారికి అందజేయాలన్నారు. ఆయా గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఓటరు జాబితాను పరిశీలించారు. నామినేషన్ వేసిన అభ్యర్థుల వివరాలను నోటీసు బోర్డులో ఏ రోజుకు ఆ రోజు అతికించాలన్నారు. హెల్ప్ డెస్క్ ను పరిశీలించి నామినేషన్ వేసేందుకు వచ్చే వారికి అవసరమైన సలహాలు అందజేయాలని అక్కడి సిబ్బందికి సూచించారు. నామినేషన్స్ వేసిన అభ్యర్థుల వివరాలను టీ పోల్ యాప్ లో నమోదు చేయాలన్నారు. సాయంత్రం ఐదు గంటల తర్వాత నామినేషన్ వేసేందుకు వచ్చేవారిని కేంద్రంలోకి ఎట్టి పరిస్థితుల్లో అనుమతించరాదని, నిర్దేశిత సమయంలోగా కేంద్రం లోపల ఉన్న వారి నుంచి మాత్రమే నామినేషన్లు స్వీకరించాలన్నారు. ఈ పర్యటనలో మల్దకల్ మండలం ఎంపీడీవో ఆంజనేయ రెడ్డి, ఎంఈఓ సురేష్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రాత్రి వరకు కొనసాగిన నామినేషన్ల పర్వం

**రెండవ రోజు 30 సర్పంచ్, 97 వార్డ్ సభ్యులకు నామినేషన్లు**



నామినేషన్ దాఖలు చేస్తున్న ఇస్రంపల్లి గ్రామ సర్పంచ్, వార్డ్, అభ్యర్థులు

దాసర్ పల్లి 03 సర్పంచ్, వార్డ్ సభ్యులు 14, ముచ్చింతల 03 సర్పంచ్,10 వార్డ్ సభ్యులు, తిరుమలాపూర్ 05 సర్పంచ్, ఇస్రంపల్లి 01 సర్పంచ్,11 వార్డు సభ్యులకు నామినేషన్లు స్వీకరించారు. మొత్తం కలిపి రెండవ రోజు సర్పంచ్ 30, వార్డ్ సభ్యులు 97 నామినేషన్లు దాఖలయ్యాయని అధికారులు తెలిపారు.